JAYABHERIDAILY.COM
ప్రభాత జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । గురువారం 13-08-2026
Medchal - Malkajgiri । Thursday 13-08-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 73
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 73 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com


# ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు స్టే






- షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలపై తెలంగాణ హైకోర్టు స్టే
- విచారణ సందర్భంగా మధ్యంతర ఉత్తర్వులు జస్టిస్ శ్రవణ్ కుమార్ జారీ
- రంగనాథ్‌కు నోటీసులు

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో షాది ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలపై హైకోర్టు స్టే విధించింది. ఈ సందర్భంగా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ సందర్భంగా మధ్యంతర ఉత్తర్వులు జస్టిస్ శ్రవణ్ కుమార్ జారీ చేశారు. దీనిపై తదుపరి విచారణ వరకు ఎలాంటి చెల్లింపులు ఈ పథకాల కింద చేయ వద్దంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మళ్లీ విచారణను సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది హైకోర్టు. ఉచిత పథకాల అమలుపై న్యాయవాది విజయ గోపాల్ వేసిన పిటిషన్ హైకోర్టు లో పిటిషన్ వేయడంతో ఈ విచారణ నిర్వహించింది హైకోర్టు. అయితే న్యాయవాది విజయ్ గోపాల్ ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గతంలో హైకోర్టు విచారణ చేపట్టింది. చట్టసభల్లో తీర్మానం చేయకుండా అందుబాటులోకి తెచ్చిన పథకాలు చెల్లవని విజయ్ గోపాల్ కోర్టులో వాదించారు. గత విచారణ సందర్భంగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేయగా, నాలుగు వారాలైనా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదని విజయ్ గోపాల్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో స్టే విధించిన ఉన్నత న్యాయస్థానం.. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

**రంగనాథ్‌కు నోటీసులు..**

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. దీనిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ధిక్కరణ నోటీసులు జారీ చేయాలని రిజిస్ట్రీకి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాగే మేడ్చల్ హౌజింగ్ సొసైటీ లేఔట్‌లో కూల్చివేతలపై విచారణ నిర్వహించింది. హైడ్రా చర్యలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు పరిధిలోని అంశాలపై జోక్యం తగదని హైకోర్టు సూచించింది. కూల్చివేతతలపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ కూల్చివేతలపై కౌంటర్ దాఖలు చేయాలని హైడ్రాకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది.




2 లో

# అసలు ఎత్తిన నీళ్లెన్ని.. వదిలిన నీళ్లెన్ని..?

- ఖర్చయిన కరెంటు ఎంత? లెక్కలు తీయండి
- కాళేశ్వరం లేకుండానే ఎల్లంపల్లి నిండుతోంది
- కాళేశ్వరం బ్యారేజీల్లో డయాఫ్రం వాల్: మంత్రి ఉత్తమ్
- మిల్లర్ల నుంచి బకాయిలు రాబట్టాల్సిందే!
- మహిళా సంఘాలకు ధాన్యం మిల్లింగ్ బాధ్యతలు
- మిల్లర్ల బ్లాక్‌మెయిల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని సీఎం స్పష్టం

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 12 :**

గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎల్లంపల్లితోపాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేర నీటిని ఎత్తిపోయాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లేకున్నా ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండుతోందని చెప్పారు. ఇన్నాళ్లూ ఎక్కడ నీళ్లు కనిపించినా కాళేశ్వరం నీళ్లేనని విపక్ష నేతలు ప్రచారం చేసుకున్నారని.. దీనిపై అసలు వాస్తవాలను ప్రజల ముందు పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఆ బ్యారేజీల నుంచి ఎత్తిపోసిన నీళ్లెన్ని, కిందకు వదిలేసిన నీళ్లెన్ని, వాడుకున్న నీళ్లెన్ని అనే వివరాలపై సమగ్రమైన లెక్కలు తీయాలని చెప్పారు. బుధవారం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్‌హెచ్చార్డీ)లో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ''2019 నుంచి 2023 మధ్య రాష్ట్రంలో ఎక్కడ నీళ్లు కనిపించినా కాళేశ్వరం నీళ్లేనని ప్రచారం చేసుకున్నారు. 2019లో కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణం పూర్తయింది. 2023 అక్టోబరులో మేడిగడ్డ కుంగింది, అన్నారం, సుందిళ్లలో సీపేజీలు బయటపడ్డాయి. 2019 నుంచి 2023 దాకా కాళేశ్వరం బ్యారేజీల నుంచి ఎన్ని నీళ్లను ఎత్తిపోశారు? మళ్లీ కిందికి వదిలేసిన నీళ్లెన్ని? ఎన్ని టీఎంసీలను వినియోగించారు? ఎత్తిన నీటి కోసం ఎంత విద్యుత్ ఖర్చయిందనే సమగ్రమైన లెక్కలు తీసి ప్రజల ముందుంచాలి'' అని అధికారులను ఆదేశించారు. దీనిపై స్పందించిన అధికారులు.. ఐదేళ్లలో 161.36 టీఎంసీలను ఎత్తిపోశారని, కానీ వరద రావడంతో ఎత్తిపోసిన నీటిలో 60 టీఎంసీలకుపైగా మళ్లీ నదిలోకే వదిలేశారని వివరించారు. అయితే ఈ వివరాలపై సమగ్రమైన లెక్కలు తీయాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. మేడిగడ్డ నుంచి ఎత్తిపోయకుండా నీళ్లన్నీ వదిలేస్తున్నారని విపక్షం తప్పుడు ప్రచారం చేస్తోందని.. కాళేశ్వరం లేకుండానే ఎల్లంపల్లికి 43 టీఎంసీల వరద వచ్చిందని గుర్తుచేశారు. అందులో మిడ్‌మానేరుకు 17 టీఎంసీలను ఎత్తిపోశామని.. మరో 20 టీఎంసీలకుపైగా నదిలోకి వదిలేయాల్సి వచ్చిందని వివరించారు.





# జస్ట్ నిమిషాల్లోనే ప్రయాణం

- 34 రహదారులు.. 350 కి.మీ.. రూ.1,519 కోట్లతో 21.77 కి.మీ
- ఏపీలో అందుబాటులోకి 2 కొత్త రహదారులు
- బకింగ్ హామ్ కెనాల్‌పై ఉక్కు వంతెన
- అమరావతిలో ట్రాఫిక్ తగ్గడంతో పాటు వేగవంతమైన ప్రయాణం

**జయభేరి, అమరావతి :**

రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. రాజధాని రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలవనున్న ఇ3 సీడ్ యాక్సెస్ రోడ్, బకింగ్‌హామ్ కెనాల్‌పై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ప్రారంభించనున్నారు. దీంతో రాజధానిలోకి రాకపోకలు మరింత వేగవంతం, సులభతరం కానున్నాయి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రపంచస్థాయి ప్రమాణాలతో గ్రిడ్ తరహాలో అభివృద్ధి చేస్తున్న అమరావతి రాజధాని రహదారుల నిర్మాణానికి ఈ ప్రాజెక్టు కీలక ముందడుగుగా నిలవనుంది. అమరావతిలోని ఎన్1 నుంచి ఎన్17 వరకు ఉన్న అన్ని ఎన్‌సిరీస్ రహదారులను ఇ3 అనుసంధానించనుంది. ఉత్తరం నుంచి దక్షిణం, తూర్పు నుంచి పడమర దిశల్లో గ్రిడ్ తరహాలో రహదారులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. అనవసర మలుపులు లేకుండా రాజధాని ప్రాంతంలోకి నేరుగా చేరుకునేలా ఈ రహదారి వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇ, ఎన్ సిరీస్ రోడ్లలో కలిపి 34 ప్రధాన రహదారులు.. మొత్తం 350 కిలోమీటర్ల మేర నిర్మాణం జరుగుతోంది. భవిష్యత్‌లో పెరగనున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని రాజధాని రవాణా వ్యవస్థకు పటిష్ఠమైన పునాది వేస్తున్నారు. దొండపాడు నుంచి ప్రారంభమయ్యే ఇ3 రోడ్డు రాయపూడి, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి, తాడేపల్లి మీదుగా మణిపాల్ హాస్పిటల్స్ వద్ద NH16ను కలుపుతుంది. 21.77 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారి నిర్మాణానికి రూ.1,519 కోట్లు వెచ్చిస్తున్నారు. 60 మీటర్ల వెడల్పుతో మూడు దశల్లో నిర్మిస్తున్న

...మిగతాది 2 లో

# ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు డెడ్‌లైన్

- 2018లో పునాది.. ఇప్పటికీ పూర్తి కాలేదు
- కొత్త కాంట్రాక్టర్‌తో పనులు వేగం
- 2026 దసరాకల్లా పూర్తి చేయాల్సిందే..
- అధికారులకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు





2 లో

> ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనుల పురోగతిపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎన్‌హెచ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2018లో ప్రారంభమై ఆరేళ్లకు పైగా నత్తనడకన సాగుతున్న ఈ ప్రాజెక్టును 2026 దసరా నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మ్యాన్‌పవర్‌ను పెంచి మూడు షిఫ్టుల్లో పనులు చేయాలని ఆదేశించారు. పనుల్లో వేగం తగ్గటానికి వీల్లేదని ప్రతి 10 రోజులకు ఒకసారి క్షేత్రస్థాయిలో తాను పర్యవేక్షిస్తానని హెచ్చరించారు. కాంట్రాక్టర్ మార్పుతో పనులు వేగవంతమవుతాయా? దసరా నాటికి ప్రాజెక్టు పుర్తవుతుందా..?

**జయభేరి, ఉప్పల్ :**

హైదరాబాద్‌లో కీలకమైన ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. పనులు నత్తనడకన సాగుతుండటంపై రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జాతీయ రహదారుల అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2026 దసరా నాటికి కారిడార్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం ఇప్పటికే మాట ఇచ్చిందని, ఇకపై ఎలాంటి జాప్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. సచివాలయంలో మంగళవారం ఎన్‌హెచ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో పనుల పురోగతిపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మ్యాన్‌పవర్‌ను పెంచి మూడు షిఫ్టుల్లో పనులు నిర్వహించాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి ఆదేశించారు. కారిడార్ కింద ఉన్న 6.25 కిలోమీటర్ల బీటీ రహదారి పనులను ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నారపల్లి, ఉప్పల్ రెండు వైపుల నుంచి లాంచింగ్ గడ్డర్లను వినియోగించి నిర్మాణ వేగాన్ని పెంచాలని సూచించారు. అదే సమయంలో కారిడార్‌కు అనుసంధానంగా జీహెచ్‌ఎంసీ నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులతో ఎన్‌హెచ్ అధికారుల సమన్వయం పెంచాలని మంత్రి ఆదేశించారు. పనుల పురోగతిని ఇకపై తాను ప్రతి పది రోజులకు ఒకసారి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని తెలిపారు.



# అయ్యో అనిత.. మరికాసేపట్లో డెలివరీ

- అంతలోనే మృతి చెందినట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు సమాచారం

**జయభేరి, సంగారెడ్డి జిల్లా :**

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాన్పు కోసం వచ్చిన ఓ గర్భిణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ ప్రాణాలు కోల్పోయిందని మృతురాలి బంధువుల ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు.. బాధితులకు న్యాయం చేయాలంటూ ధర్నా చేపట్టారు.

...మిగతాది 2 లో



# అడ్డదారులు వద్దు.. బలైపోతారు..

- అడ్డదారులు ఎంచుకుంటే తీవ్ర నష్టం
- రీల్స్ విడిచి మహనీయులను చదవండి
- ప్రతిభతో కెరీర్‌పై దృష్టి పెట్టండి
- జెన్‌జీకి మోదీ సీరియస్ మెసేజ్

**జయభేరి, న్యూఢిల్లీ :**

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'Triumph of the Indian Republic: My Life, My Struggles' పుస్తకావిష్కరణ వేడుక ఢిల్లీలో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ, నేటి వేగవంతమైన డిజిటల్ యుగంలో పయనిస్తున్న జెన్‌జీ యువతను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. సాంకేతికత పెరిగిన ఈ రోజుల్లో యువత తమ లక్ష్యాలను సాధించడానికి ఎంచుకుంటున్న మార్గాలు, వారి ఆలోచనా దృక్పథంపై మోదీ ప్రత్యేకంగా దృష్టి సారించారు.

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## వదిలిన నీళ్లెన్ని..?

ఈ వాస్తవాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. గోదావరి జలాలను గరిష్ఠ స్థాయిలో వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేనివిధంగా తొమ్మిది పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని చెప్పారు.
దేవాదుల, సీతారామ ప్రాజెక్టులకు సంబంధించి ఇంకా ఉన్న చిన్న చిన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని.. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించారు. గట్టు రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.03 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెంచాలని, ఈ మేరకు ప్రతిపాదనలను 14న జరిగే కేబినెట్ భేటీలో పెట్టాలని సీఎం ఆదేశించారు.
గుడెందొడ్డిలో పంప్డ్ స్టోరేజీ జలవిద్యుత్ కేంద్రం ఏర్పాటుకు అవకాశాలపై అధ్యయనం కోసం కన్సల్టెన్సీని నియమించాలన్నారు. మక్తల్‌నారాయణపేటకొడంగల్ ఎత్తిపోతల పథకంలో ఆయకట్టు కోసం అవసరమైన ప్రతిపాదనలను మంత్రివర్గం ముందుంచాలన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో బ్యారేజీల ఎగువ, దిగువ భాగంలో డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని సమావేశంలో మంత్రి ఉత్తమ్ వివరించారు. సీకెంట్ పైల్స్‌లో లోపాలు, డి జైన్‌లో సమస్యలు, నిర్వహణలోపాలతో బ్యారేజీలు విఫలమయ్యాయని పరీక్షల్లో తేలిందని చెప్పారు. డయాఫ్రం వాల్ నిర్మాణంతో సీపేజీలను అడ్డుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ అంశంలో ఎన్డీఎస్ఏతో సంప్రదించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.
తెలంగాణలో వరి ఉత్పత్తి రికార్డు స్థాయికి చేరడానికి కాళేశ్వరం ప్రాజెక్టు కారణంకాదని.. గత పదేళ్లలో మంచి వర్షాలు, సాగునీటి లభ్యత పెరగటం, రైతు రుణమాఫీ, రైతుభరోసా, 24 గంటల ఉచిత విద్యుత్, రైతు కేంద్రిత విధానాలతోనే ధాన్యం ఉత్పత్తి పెరిగిందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.
ఈ మేరకు ఆచార్య జయశంకర్ వ్యవసాయ వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య 'ఆంధ్రజ్యోతి' ఎడిటోరియల్ పేజీలో చేసిన విశ్లేషణను సీఎం బుధవారం తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. రాష్ట్రంలో రైతులు గత కొన్నేళ్లలో సుమారు 15 లక్షల కొత్త బోర్లు వేశారని, వాటిద్వారా అదనంగా 40 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయని సీఎం పేర్కొన్నారు.
రాష్ట్రంలో రైతుల పరిస్థితి, వారి సంక్షేమం, ఆదాయంలో మార్పు కాంగ్రెస్ పాలనలోనే ప్రారంభమైందన్నారు. ఎనిమిది నుంచి పది అడుగుల వెడల్పుతో.. 60 నుంచి 90 మీటర్ల పొడవుతో.. భారీ సంచుల్లా ఉండే నిర్మాణాలనే 'సైలో బ్యాగ్స్' అంటారు. ఒక్కో సైలో బ్యాగ్‌లో 250 టన్నుల వరకు ధాన్యం నిల్వ చేయవచ్చు. నీళ్లు, కాంతి చొరబడకుండా ఉండే ప్రత్యేకమైన ప్లాస్టిక్ పాలిమర్లతో ఈ బ్యాగులను రూపొందిస్తారు.
ధాన్యం తడిసిపోవడం, పురుగులు పట్టడం, చెడిపోవడం వంటివాటికి అవకాశం తక్కువ. గోదాములు, కాంక్రీట్ ప్లాట్‌ఫారాల వంటివాటితో పోలిస్తే ఖర్చు చాలా తక్కువ. ఎలాంటి ప్రత్యేకమైన నిర్మాణాలు అవసరం లేకుండా.. పొలాల్లోనే ఈ 'సైలో బ్యాగ్'లను ఏర్పాటు చేయవచ్చు. ధాన్యాన్ని అటు కొనుగోలు కేంద్రానికి, ఇటు మిల్లులకు, గోదాములకు తిప్పాల్సిన ఇబ్బంది తప్పుతుంది. అవసరమైనప్పుడు నేరుగా గోదాములకో, మిల్లులకో తరలించవచ్చు.

## అడ్డదారులు వద్దు.. బలైపోతారు..

జీవితంలో వేగంగా ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి అడ్డదారులు వెతికితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రధాని స్పష్టం చేశారు. రైల్వే స్టేషన్లలో తరచూ కనిపించే 'A shortcut will cut you short' అనే హెచ్చరిక బోర్డును ఈ సందర్భంగా ఆయన ఉదాహరణగా చెప్పారు. సమయం ఆదా చేసుకోవడానికి ఫుట్‌బ్రిడ్జ్ వాడకుండా రైలు పట్టాలు దాటే ప్రయత్నం చేయడం ఎంత ప్రమాదకరమో, కెరీర్‌లో అనుసరించే అడ్డదారులు కూడా అంతే ముప్పు తెస్తాయని హెచ్చరించారు.
రీల్స్, ఇన్‌ఫ్లుయెన్సర్ల భ్రమల్లో పడకుండా మహనీయుల ఆత్మకథలు చదివి ప్రేరణ పొందాలని పిలుపునిచ్చారు. ఈ మధ్యకాలంలో యువతకు మరింత దగ్గరయ్యేందుకు మోదీ తన సోషల్ మీడియా విధానంలో మార్పులు తెచ్చిన సంగతి తెలిసిందే. ఇన్‌స్టాగ్రామ్‌లో సెల్ఫీ వీడియోలు పోస్ట్ చేస్తూ, నేటితరం వాడుక భాషలోనే వారితో కనెక్ట్ అవుతున్నారు. అయితే, కేవలం డిజిటల్ రీల్స్ చూడటానికి, చేయడానికి మాత్రమే కాలాన్ని పరిమితం చేయకుండా, తమలోని నిజమైన ప్రతిభను వెలికితీసి కెరీర్‌పై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని ప్రధాని యువతకు హితవు పలికారు.

## ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు డెడ్‌లైన్

2026లోనే ఎలివేటెడ్ కారిడార్‌ను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిందేనని ఆయన తేల్చిచెప్పారు. కాగా, ఉప్పల్ జంక్షన్ నుంచి నారపల్లి వైపు సీపీఆర్ఐ వరకు నిర్మిస్తున్న ఈ ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ పొడవు 6.25 కిలోమీటర్లు. ప్రాజెక్టు అంచనా నిర్మాణ వ్యయం రూ.626.76 కోట్లు. భూసేకరణ వ్యయం అదనంగా ఉంది. జాతీయ రహదారి 163లో హైదరాబాద్ పట్టణ పరిధిలోని రద్దీని తగ్గించేందుకు ఈ ప్రాజెక్టును చేపట్టారు. ఈ కారిడార్ పూర్తయితే వరంగల్, యాదాద్రి, భువనగిరి వైపు వెళ్లే వాహనాలకు ఉప్పల్-నారపల్లి మార్గంలో వేగవంతమైన రాకపోకలు సాధ్యమవుతాయి.

**2018లో పునాది.. ఇప్పటికీ పూర్తి కాలేదు**

ఈ ప్రాజెక్టుకు 2018లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అప్పట్లో నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, ప్రాజెక్టు అనేక అవాంతరాలను ఎదుర్కొంది. 2023లో కేంద్ర ప్రభుత్వ పార్లమెంటరీ సమాధానంలోనే దీని షెడ్యూల్ పూర్తి తేదీ 2024 జూన్ 24గా నమోదై ఉంది.
అయితే ఆ గడువు కూడా దాటిపోయింది. ప్రాజెక్టు ఆలస్యానికి ప్రధానంగా కాంట్రాక్టర్ ఆర్థిక ఇబ్బందులు, పరిపాలనా సమస్యలు, వివిధ శాఖల మధ్య సమన్వయ లోపాలు కారణాలుగా వెల్లడించారు. 2025లో రోడ్లు, భవనాల శాఖకు అందిన ఫిర్యాదుపై ఇచ్చిన సమాధానంలోనూ కాంట్రాక్టర్ ఆర్థిక సమస్యలు, జీహెచ్ఎంసీ పనులతో సమన్వయం వంటి అంశాలు ఆలస్యానికి కారణాలుగా పేర్కొన్నారు. భూసేకరణ, యుటిలిటీ మార్పులు, మెట్రో నిర్మాణానికి అనుగుణంగా డిజైన్‌లో మార్పులు వంటి అంశాలు కూడా పనుల వేగాన్ని ప్రభావితం చేశాయి. ముఖ్యంగా ఉప్పల్ మెట్రో స్టేషన్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్, ఎత్తు తదితర అంశాలపై అదనపు సమన్వయం అవసరమైంది. గతంలో భూసేకరణ పరిహారం చెల్లింపుల్లో జాప్యం కూడా పనులకు ఆటంకంగా నిలిచినట్లు అధికారులు పేర్కొన్నారు.

**కాంట్రాక్టర్ మార్పుతో వేగం పెంచే ప్రయత్నం**

ఏళ్ల తరబడి పనులు ముందుకు సాగకపోవటంతో పాత కాంట్రాక్టర్‌ను మార్చి కొత్త కాంట్రాక్టర్‌తో పనులు ముందుకు తీసుకెళ్లే చర్యలు చేపట్టారు. 2025లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో చర్చల అనంతరం కాంట్రాక్టర్‌ను మార్చామని, పనులను వేగవంతం చేస్తున్నామని ప్రకటించారు.
అనంతరం 2026 దసరా నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే పనుల కారణంగా ఉప్పల్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఉప్పల్-వరంగల్ మార్గంలో రాకపోకలను మళ్లించడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉప్పల్-నారపల్లి మధ్య సుమారు 6 కిలోమీటర్ల ప్రయాణానికి రద్దీ సమయాల్లో అదనంగా 30-45 నిమిషాలు పడుతున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. అయితే ఇప్పటికే పలుమార్లు గడువులు మారిన నేపథ్యంలో ఈసారి అయినా నిర్దేశించిన డెడ్‌లైన్‌లో పనులు పూర్తవుతాయా? అన్నదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# స్వాతంత్ర్య దినోత్సవానికి రెడ్ ఫోర్ట్ సిద్ధం

**జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 12 :**

17వ శతాబ్దంలో వర్తకం కోసం ఇండియాకు వచ్చిన ఆంగ్లేయులు.. తర్వాత నాటి దేశంలోని అనైక్యతను ఆసరాగా తీసుకుని చివరకు అధికారం చేజిక్కించుకుని పెత్తనం చెలాయించారు. దాదాపు 200 సంవత్సరాల పాటు సాగిన బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు జరిగాయి.
చివరకు 1947లో భరతమాతకు విదేశీ పాలన నుంచి విముక్తి లభించింది. ఆ ఏడాది 15న స్వాతంత్ర్యం లభించింది. అప్పటి నుంచి ఏటా ఆగస్టు 15న భారతావని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకుంటోంది.
భారతదేశం మరో నాలుగు రోజుల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోనుంది. అయితే ఈ వేడుక సమీపిస్తున్న తరుణంలో ఒక ప్రశ్న తరచుగా వేధిస్తుంది. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం 79వదా లేక 80వదా?. భారతదేశం స్వాతంత్ర్య పొంది ఎన్ని సంవత్సరాలు గడిచాయి? లేదా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సంఖ్య ఎంత? అనే దానిపై ఈ సమాధానం ఆధారపడి ఉంటుంది.
బ్రిటిష్ పాలన నుంచి భారతదేశం 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం పొందింది. అందువల్ల 2026 ఆగస్టు 15 నాటికి దేశం 79 ఏళ్ల స్వాతంత్ర్యాన్ని పూర్తి చేసుకుంటుంది. కానీ, 2026 ఆగస్టు 15 భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను సూచిస్తుంది.



**79 లేదా 80వ వేడుకనా?**

భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సిద్ధించింది. కాబట్టి 2026 ఆగస్టు 15 నాటికి 79 ఏళ్లు పూర్తవుతాయి. అంటే, 2026 1947 = 79 సంవత్సరాలు. అదే సమయంలో మొదటి స్వాతంత్ర్య దినోత్సవాన్ని 1947లోనే జరుపుకున్నాం. ఆ వేడుకను మొదటి స్వాతంత్ర్య దినోత్సవం అనుకుంటే 2026 నాటికి ఇది 80వ వేడుక అవుతుంది. కాబట్టి, వేటిని పరిగణనలోకి తీసుకుంటున్నారనే దానిబట్టి ఈ రెండు పదాలు సరైనవే కావచ్చు. ఎందుకంటే 2026 నాటికి 79 వ స్వాతంత్ర్యం పూర్తవుతుంది. 2026 ఆగస్టు 15న 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆగస్టు 15, 1947 భారత మొదటి స్వాతంత్ర్య దినోత్సవం.

**ఈ ఏడాది 80వ స్వాతంత్ర్య దినోత్సవమా?**

వార్షికోత్సవానికి, సంఖ్యతో కూడిన వేడుకకు మధ్య ఉండే వ్యత్యాసమే ఈ గందరగోళానికి ప్రధాన కారణం. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, దేశం తన తొలి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంది. ఆ తర్వాత సంవత్సరం రెండోది. ప్రతి ఆగస్టు 15న ఈ లెక్కింపు కొనసాగింది.

1947 మొదటి స్వాతంత్ర్య దినోత్సవం
1948 రెండో స్వాతంత్ర్య దినోత్సవం
1949 మూడో స్వాతంత్ర్య దినోత్సవం
2025 79వ స్వాతంత్ర్య దినోత్సవం
2026 80వ స్వాతంత్ర్య దినోత్సవం

కాబట్టి దేశానికి స్వాతంత్ర్య వచ్చి 79 ఏళ్లు పూర్తయినప్పటికీ, 2026 ఆగస్టు 15 భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం కావడానికి ఇదే కారణం. భారత్ 2026లోనే తన 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటుంది. 79 వసంతాలు పూర్తి చేసుకుంటుంది. భారతదేశానికి స్వాతంత్ర్య వచ్చి ఎన్ని సంవత్సరాలైంది అని అడిగితే సమాధానం 79 ఏళ్లు. భారతదేశం ఎన్నో స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటుంది అని అడిగితే, సమాధానం 80వ స్వాతంత్ర్య దినోత్సవం.

**స్వాతంత్ర్య దినోత్సవం 2026 వేడుకలు**

దాదాపు రెండు శతాబ్దాల బ్రిటిష్ పాలన నుంచి దేశానికి 1947 ఆగస్టు 15న విముక్తి లభించడంతో ఏటా స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటారు. దేశవ్యాప్తంగా జెండా వందన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర వేడుకలతో దీనిని నిర్వహిస్తారు. ప్రధాన జాతీయ వేడుక న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరుగుతుంది. అక్కడ ప్రధాన మంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించి దేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు.



# నియోపోలీస్ లో ఎకరా 120 కోట్లు

> హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధుల సమీకరణే లక్ష్యంగా కోకాపేట్‌లోని నియోపోలిస్, గోల్డెన్ మైల్ లేఅవుట్లతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములను వేలం వేయడానికి సిద్ధమైంది. నియోపోలిస్‌లో ఎకరానికి కనీస ధర రూ. 120 కోట్లుగా, గోల్డెన్ మైల్‌లో రూ. 70 కోట్లుగా ఖరారు చేశారు. ఈ వేలం ప్రక్రియ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 9 వరకు సాగనుంది. మోకిలా, బాచుపల్లి, సూరారం వంటి నివాస ప్రాంతాల్లోని ఖాళీ ప్లాట్లను కూడా ఈవేలంలో ఉంచారు.

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 12 :**

హైదరాబాద్ నగర పరిధిలో భూముల విక్రయాల ద్వారా భారీగా ఆదాయం సమీకరించడమే ధ్యేయంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ మరొక భారీ ఈవేలానికి శ్రీకారం చుట్టింది. అత్యంత ఖరీదైన కోకాపేట్‌లోని నియోపోలిస్, గోల్డెన్ మైల్ లేఅవుట్లలో ఉన్న విలువైన భూములతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ ప్లాట్లను విక్రయించడానికి అధికారులు నోటిఫికేషన్ సిద్ధం చేశారు. గతంలో డిసెంబర్ 2025లో నిర్వహించిన నియోపోలిస్ భూముల వేలంలో ఎకరానికి అత్యధికంగా రూ. 131 కోట్లు, రూ. 118 కోట్ల వరకు ధర పలికి హెచ్ఎండీఏకి సుమారు రూ. 1000 కోట్ల ఆదాయం సమకూరింది.అంతకుముందు వివిధ దశల్లో చేపట్టిన వేలం పాటల ద్వారా సుమారు రూ. 3,708 కోట్లు వచ్చాయి. గతంలో నమోదైన రికార్డు ధరలను ప్రాతిపదికగా తీసుకుంటూ.. ప్రస్తుతం నియోపోలిస్ లేఅవుట్‌లోని 4.59 ఎకరాల భూభాగానికి కనీస ధరగా ఎకరానికి రూ. 120 కోట్లుగా నిర్ణయించారు. అలాగే గోల్డెన్ మైల్ లేఅవుట్‌లోని 0.70 ఎకరాల భూమికి ఎకరానికి రూ. 70 కోట్ల ప్రారంభ ధరను నిర్ణయించారు. ఈ ప్రధాన రెండు లేఅవుట్లకు సెప్టెంబర్ 9న ఈవేలం జరగనుంది.ఈ వేలం ప్రక్రియ మొత్తం ఆగస్టు 24న ప్రారంభమై సెప్టెంబర్ 9 వరకు కొనసాగనుంది. కోకాపేట్ మాత్రమే కాకుండా నగర శివారులలో ఉన్న పలు రెసిడెన్షియల్ లేఅవుట్లలో కూడా భూములను హెచ్ఎండీఏ అమ్మకానికి ఉంచింది.
కూకట్‌పల్లి సమీపంలోని హైదరాబాద్ నగర్, మోకిలా, బాచుపల్లి, కొత్తూర్ సమీపంలోని ఇన్ముల్‌నర్వ లేఅవుట్లతో పాటు బైరాగిగూడ, చందానగర్, సూరారం, కాప్రా, కిష్టారెడ్డిపేట్, సరూర్‌నగర్ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను వేలంలో విక్రయించనున్నారు. ఈ వేలంలో భాగంగా మోకిలా లేఅవుట్‌లోని 300 నుంచి 500 చదరపు గజాల ప్లాట్లకు చదరపు గజానికి కనీస ధర రూ. 55 వేలు, బాచుపల్లి లేఅవుట్‌లోని ప్లాట్లకు రూ. 45 వేలుగా నిర్ణయించారు. అలాగే సూరారంలో ఉన్న 2,420 చదరపు గజాల ల్యాండ్ పార్సెల్‌కు గజానికి రూ. 75 వేలు, మరో 4,840 చదరపు గజాల ప్లాట్‌కు గజానికి రూ. 55, వేలు అప్‌సెట్ ధరగా ఖరారు చేశారు. క్లియర్ టైటిల్స్ ఉన్న ఈ ప్రభుత్వ భూముల విక్రయానికి బిల్డర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు, కొనుగోలుదారుల నుంచి భారీ స్పందన వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

## అయ్యో అనిత..

పూర్తి వివరాల్లోకి వెళ్తే.. చౌటకూర్ మండలం బద్రిగూడెం గ్రామానికి చెందిన అనిత అనే గర్భిణి.. ఈ నెల 10వ తేదీన కాన్పు కోసం సంగారెడ్డి మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేరింది. ఈరోజు ఉదయం ఆమెకు డెలివరీ చేయాల్సి ఉండగా.. అనిత మృతి చెందినట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురైన కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. వారు బంధువులకు సమాచారం ఇవ్వడంతో.. పెద్ద ఎత్తున ఆస్పత్రి దగ్గరకు చేరుకుని.. వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు సకాలంలో స్పందించక పోవడం, వారి నిర్లక్ష్యం కారణంగానే అనిత ప్రాణాలు కోల్పోయిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధ్యులైన డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆస్పత్రి గేటు ముందు బైఠాయించి నిరసనకు దిగారు. బాధితుల ఆందోళనతో ఆస్పత్రి ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని, ఆందోళనకారులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కాగా.. ఈ ఘటనపై ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు సమాచారం..

## జస్ట్ నిమిషాల్లోనే ప్రయాణం

ఈ కారిడార్‌లో 9 లేన్ల రహదారి, ప్రత్యేక బీఆర్టీఎస్ కారిడార్, సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయనున్నారు. డ్రైనేజీ, మంచినీటి సరఫరా, గ్యాస్, విద్యుత్ నెట్‌వర్క్‌లకు అవసరమైన మౌలిక వసతులను కూడా రహదారి నిర్మాణంతోపాటే కల్పిస్తున్నారు. సైకిల్ ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌లు, గ్రీన్‌బెల్ట్‌లతో ఇ3ను ఆధునిక నగర రహదారిగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. ఇ3 రోడ్డును విజయవాడ-మంగళగిరి హైవేతో అనుసంధానించేందుకు బకింగ్‌హామ్ కెనాల్‌పై రూ.82 కోట్లతో 478 మీటర్ల పొడవున నాలుగు వరుసల స్టీల్ బ్రిడ్జిని ప్రభుత్వం నిర్మించింది. దీనిని కూడా సీఎం చంద్రబాబు నేడు ప్రారంభించనున్నారు. వంతెన అందుబాటులోకి రావడంతో విజయవాడ నుంచి అమరావతికి రాకపోకలకు మెరుగైన మార్గం ఏర్పడుతుంది. కరకట్ట రోడ్డుపై ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గిస్తూ.. వాహనాలు సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా నేరుగా అమరావతికి చేరుకునే అవకాశం కలుగుతుంది. రాజధాని అమరావతి పునర్నిర్మాణంలో రహదారుల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోన్న ప్రభుత్వం.. మౌలిక వసతులను వేగంగా పూర్తి చేస్తోంది. ఇవాళ సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఇ3 రోడ్, స్టీల్ బ్రిడ్జి ప్రారంభం కావడం.. అమరావతి పునర్నిర్మాణ వేగానికి మరో కీలక సంకేతంగా నిలవనుంది.

# ప్రీతిపాత్రం.. శ్రావణమాసం

- నేటి నుండి శ్రావణ మాసం ప్రారంభం
- శ్రావణ సోమవారాల్లో శివుడికి రుద్రాభిషేకాలు

**జయభేరి, దేవరకద్ర :**



హిందూ సంప్రదాయంలో శ్రావణ మాసం అత్యంత పవిత్రమైన, ఆధ్యాత్మిక మాసం.ఇది శివకేశవులకు, శ్రీమహాలక్ష్మికి అత్యంత ప్రీతికరమైన నెల. ఈ మాసంలో ప్రతి రోజూ పూజలు, నోములు, వ్రతాలు ఆచరించడం వల్ల అష్టైశ్వర్యాలు, దీర్ఘసుమంగళీ ప్రాప్తం కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

శ్రావణ మాసం విశిష్టతలు, శివారాధన..

శ్రావణ సోమవారాల్లో శివుడికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయడం వల్ల విశేష ఫలితాలు ఉంటాయి.మహిళల వ్రతాలు ఎక్కువగా చేయడం వల్ల ఈ నెలను 'వ్రతాల మాసం'అని అంటారు. సౌభాగ్యం కోసం మంగళగౌరీ వ్రతం, వరలక్ష్మీ వ్రతం ఘనంగా ఆచరిస్తారు. ఈ మాసంలో ప్రధాన పండుగలు వరలక్ష్మి వ్రతం, రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్),శ్రీకృష్ణాష్టమి,నాగుల చవితి వంటి పండుగలు ఈ మాసంలోనే వస్తాయి.దీపారాధన విషయానికి వస్తే ఇల్లు, తులసి కోట వద్ద నిత్యం దీపం వెలిగించడం ద్వారా సానుకూల శక్తి పెరిగి, నెగటివిటీ తొలగిపోతుంది. శ్రావణ మాస విశిష్టత శ్రావణ మాసం అంటే శుభ మాసం. శ్రావణ మాసాన్ని నభో మాసం అని కూడా అంటారు, నభో అంటే ఆకాశం అని అర్థం. ఈ నెలలో వచ్చే సోమవారాలు, మంగళవారాలు, శుక్రవారాలు, శనివారాలు ఎంతో పవిత్రమైనవి. ఈ నెలలో వచ్చే ముఖ్యమైన పర్వదినాలు జంధ్యాల పౌర్ణమి, కృష్ణాష్టమి, పొలాల అమావాస్య, నాగ చతుర్థి ,నాగ పంచమి పుత్రాదా ఏకాదశి, దామోదర ద్వాదశి, వరహ జయన్తి ఇలా అనేక పండుగలు వస్తాయి. శ్రావణ మాసం చంద్రుడి మాసం కూడా, చంద్రుడు మనఃకారకుడు. అంటే సంపూర్ణముగా మనస్సు మీద ప్రభావము చూపే మాసము. ఈ మాసమందు రవి సంచరించు నక్షత్రముల ప్రభావము చంద్రుని మూలకముగా మన మీద ప్రభావం చూపుతాయి. చంద్రుని చార నుంచి జరగబోవు దుష్ఫలితాలను నివారించుటకు, మంచి కలిగించుటకు, ధర్మాచరణములను పండుగగా ఆచరించడం నియమమైనది. మనస్సు మీద మంచి ప్రభావము ప్రసరించి పరమార్థము వైపు మనస్సును త్రిప్పుకొని మానసిక శాంతి పొందడానికి, ప్రకృతి వలన కలిగే అస్తవ్యస్త అనారోగ్యముల నుండి తప్పించుకొనుటకు, మంచి ఆరోగ్యాన్ని పొందడం కోసం శ్రావణ మాసం లో వచ్చే పండుగలలో నిర్దేశించిన ఆచారాలను పాటించడం ముఖ్యోద్దేశమైనది.

**శ్రావణ సోమవారం**

ఈ మాసం లో వచ్చే సోమవారాలలో శివ భక్తులు ఉపవాసాలుంటారు. దీక్షతో ఉపవాసం ఉండి, శివుడికి అన్ని రకాల అభిషేకాలు నిర్వహిస్తారు. పార్వతి దేవికి కుంకుమ పూజ చేస్తే ఐదవతనం కలకాలం నిలుస్తుందని భక్తులు ప్రగాఢం గా నమ్ముతారు.

**శ్రావణ మంగళవారం**

శ్రీ కృష్ణుడు ద్రౌపదీ దేవికి, నారద మునీంద్రుడు సావిత్రిదేవికి ఉపదేశించిన మంగళగౌరి వ్రతము ఈ మాసం లో ఆచరించడం ఎంతో ప్రాసస్త్యమైనవి. మంగళగౌరి కటాక్షం ఏ స్త్రీల పై ఉంటుందో వారికి వైధవ్య బాధ ఉండదు. సర్వవిధ సౌభాగ్యాలతో వారు వర్ధిల్లుతారు. కొత్తగా పెళ్ళైన వారు తప్పక ఐదు సంవత్సరాలు ఈ వ్రతాన్ని ఆచరించడం ఆనవాయితీ. అలాగే కొన్ని ప్రాంతాల వారు ఈ వ్రతాన్ని పెళ్లి కాని పిల్లల చేత కూడా చేయిస్తారు. పెళ్లి కి ముందు నాలుగు సంవత్సరాలు చేయించి పెళ్ళైన తర్వాత మిగిలిన ఒక సంవత్సరం ఈ వ్రతాన్ని నోచుకొంటారు.

**శ్రావణ శుక్రవారం**

ఈ మాసం లో పౌర్ణమి కి ముందు వచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మి వ్రతాన్ని ఆచరిస్తారు. వరలక్ష్మి దేవి ని షోడసోపచారాలతో పూజలు చేస్తే అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు, అయిదవతనం, సంతానాభివృద్ది కలకాలం ఉంటాయని పెద్దలు అంటారు. లక్ష్మి దేవి భక్త శులభురాలు. ధనం, భూమి, విజ్ఞానం, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, బలం ఈ అష్ట శక్తులని అష్టలక్ష్ములు గా ఆరాదిస్తాము. శ్రీ మహావిష్ణువు లోకాలన్నింటిని రక్షించేవాడు, ఈ శక్తులన్నీ ఈయన ద్వారా ప్రసరించేవే. అతీత విషయాలని సామాన్య మానవులు గ్రహించలేరు. ఈ శక్తులన్నీ సక్రమంగా ఉంటేనే మనకి ఆయురారోగ్య, ఐశ్వర్య, సంతోషాలు కలుగుతాయి. లక్ష్మి దేవికి అత్యంతప్రీతికరమైన శుక్రవారం నాడు పూజిస్తే ఇవన్నిచేకూరుస్తుందని శ్రీ సూక్తం వివరిస్తుంది. అష్టలక్ష్ములలో వరలక్ష్మి దేవికి ఓ ప్రత్యకత ఉంది. మిగిలిన లక్ష్మి పూజలకంటే వరలక్ష్మి పూజ శ్రేష్ఠమని శాస్త్ర వచనం. శ్రీహరి జన్మనక్షత్రమైన శ్రవణం పేరిట వచ్చే శ్రావణ మాసం లో వరలక్ష్మి వ్రతాన్ని ఆచరిస్తే విశేష ఫలితాలు లభిస్తాయి. ఈ వ్రతాన్ని వివిధ ప్రాంతాలలో వివిధ సంప్రదాయాలలో ఆచరిస్తారు. ఎవరు ఏ రీతి లో ఆచరించిన సకల శుభకరమైన, మంగళప్రదమైన ఈ వరలక్ష్మి దేవి పూజ జగదానందకరమైనదని భక్తుల విశ్వాసం అలాగే ఈ నెలలో శ్రావణ శనివారాలు విషయానికి వస్తే..


ఈ మాసంలో వచ్చే శనివారాలలో ఇంటి ఇలవేల్పుని పూజించడం సర్వశుభాలను చేకూరుస్తుంది. ఈ మాసం లో వచ్చే అన్ని శనివారాలు చేయడానికి కుదరకపొయిన, కనీస ఒక్క శనివారమైన పూజా విధానాన్ని ఆచరించడం మంచిది.

**శ్రావణ పౌర్ణమి**

శ్రావణ పౌర్ణమి , జంధ్యాల పౌర్ణమి, హయగ్రీవ జయంతి ని ఈ రోజు జరుపుకొంటారు. శ్రీ మహావిష్ణువు యొక్క అవతారమైనటువంటి హయగ్రీవుడిని ఈ రోజున పూజించందం ద్వారా, ఏకాగ్రత, బుద్ధి కుశలత, జ్ఞానం, ఉన్నత చదువు, కలుగుతాయని ప్రతీతి .స్వామి వారి కి నైవేద్యం గా శెనగలు, ఉలవలతో చేసిన గుగ్గిళ్ళు సమర్పిస్తారు. జంధ్యాన్ని యగ్నోపవీతమని , బ్రహ్మసూత్రమని పిలుస్తారు. యజ్ఞోపవీతం సాక్ష్యాత్తు గాయత్రి దేవి ప్రతీక. యజ్ఞోపవీతం వేదాలకు ముందే ఏర్పడింది. పరమ పవిత్రమైన యజ్ఞోపవీత ధారణ వల్ల జ్ఞానాభివృద్ది కలుగుతుందని, యజ్ఞం ఆచరించిన ఫలం కలుగుతుందని వెదోక్తి. ఈ రోజు నూతన యజ్ఞోపవీతాన్ని ధరిస్తారు

**రక్షా బంధనం:**

శ్రావణ పూర్ణిమ నాటి నుండి ఒక సంవత్సరం పాటు ఎవరికీ అండగా ఉండదలచామో వారి ముంజేతికి మనం కట్టబోయే రక్షిక (రాఖీ) దైవం ముందుంచి పూజించి, ఆ పూజా శక్తిని గ్రహించిన రక్షికను అపరాహ్ణసమయం లో కట్టడం చేయాలి. అప అంటే పగలు అపరం అంటే మధ్యాహ్నం అంటే 12 దాటాక , కాబట్టి అపరాహ్ణం అంటే 12 నుండి 3 గంటల మధ్య. ఈ విధానాన్ని గర్గ్యుడనే మహర్షి చెప్పాడని శాంతి కమలాకరం చెప్తోంది కాబట్టి ఇది నేటి ఆచారం కాదనీ, ఎప్పటి నుండో వస్తున్న సంప్రదాయమేనని తెలుస్తోంది.



## శ్రావణం చాలా పవిత్రం

**బ్రహ్మశ్రీ తరిమళ హరిశంకర శర్మ**
**ప్రధాన అర్చకుడు,**
**వాసవి మాత ఆలయం**

శ్రావణమాసం చాలా పవిత్రమైనదని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ తరిమల హరి శంకర శర్మ అన్నారు. ఈమాసంలో స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయం దేవరకద్రలో శ్రావణ శుద్ధ పంచమి షష్ఠి, సప్తమి త్రయాహ్నిక దీక్షతో నవమ వార్షికోత్సవం మరియు శిల ధ్యజస్తంభ స్థాపన అష్టోత్తర శత కళాశాభిషేక.కుంభాభిషేకం నిర్వహించ బడుతుంది అని అన్నారు.



## 6డిఏలు వెంటనే ప్రకటించాలి

- తహసిల్దార్ కు టీఎస్ యుటిఎఫ్ వినతి పత్రం అందజేత

**జయభేరి, దేవరకద్ర :**

పిఆర్ సి ని వెంటనే అమలు చేయాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండల తహసిల్దార్ కు బుధవారం టీఎస్ యుటిఎఫ్, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్ పిసి) ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. 2023 నుంచి ఇవ్వాల్సిన పిఆర్సి ని అమలు చేయాలని వారు అట్టి వినతి పత్రంలో కోరారు. అంతేకాకుండా అలాగే పెండింగ్ లో ఉన్న 6 డిఏలను కూడా వెంటనే ప్రకటించాలని వారు కోరారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ మినిమం టైమ్స్ స్కేల్ అమలు చేయాలని కోరారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీయస్ ను పునరుద్ధరించాలని వారు కోరారు. తసిల్దార్ కు వినతి పత్రం సమర్పించిన వారిలో టీఎస్ యుటిఎఫ్ దేవరకద్ర మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్,కృష్ణయ్య, జిల్లా కార్యదర్శులు ఏం. వేణుగోపాల్ రెడ్డి, అజయ్, అర్చన, రవీంద్రప్ప, జగదీష్, మల్లికార్జున్, రషీద్, డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సృజన, అపర్ణ, సురేఖ, మరియు యుఎస్ పిసి సభ్యులు, ఉపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, పౌల్, కవిత, పరమేశ్వర కొండారెడ్డి, యాఘాబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత నోట్‌బుక్స్ అందజేసిన సేవా కార్యక్రమం అభినందనీయం



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 12 :**

ఉచిత నోట్ బుక్స్ అందజేసిన సేవా కార్యక్రమం అభినందనీయమని సర్పంచ్ బొత్త రాములు అన్నారు. బుధవారం తుర్కపల్లి మండలం గంధ మల్లన్న గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూపల్లి సంపత్ కుమార్ జ్ఞాపకార్థం ఆయన జయంతిని పురస్కరించుకొని ఆయన సోదరులు జూపల్లి నరేష్, జూపల్లి సురేష్ లు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందించడం ద్వారా జూపల్లి సంపత్ కుమార్ జ్ఞాపకాన్ని స్మరించుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జిల్లా గణేష్, రమణ, బోయిన చందు, సాగర్ల ఎల్లేష్, జింకల అలివేలు ఎల్లేష్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి, సాగర్ల పరమేష్ యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేద్దాం మన దేశభక్తిని చాటుదాం



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 12 :**

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేద్దాం మన దేశభక్తిని చాటాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్ అన్నారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా భారీ తెలంగాణ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బిజెపి మండల అధ్యక్షులు మేకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్, బిజెపి రాష్ట్ర ఓబిసి మోర్చా పాలసీ రీసెర్చ్ రాష్ట్ర కన్వీనర్ సురివి శ్రీనివాస్ గౌడ్లు మాట్లాడుతూ ఆర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రతి భారతీయుడులో దేశభక్తి జాతీయ ఐక్యత సమాధిలతను పెంపొందించే గొప్ప కార్యక్రమం అని అన్నారు. స్వతంత్రం కోసం మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్, జిల్లా మీడియా కోకన్వీనర్ భానోత్ శంకర్ నాయక్, రాష్ట్ర ట్రేడర్స్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కందుకూరి చల్మయ్య, రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్యవర్గ సభ్యులు చాంద్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల సైదులు ఆకుల రమేష్, భానోత్ శేత్రు నాయక్, గొర్ల రామచంద్రం, గుండెబోయిన మల్లేశం, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బొల్లా నర్సింహ యాదవ్, జిల్లా యువ మోర్చా కార్యదర్శి మేకల పాండు యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి భినారం కనకయ్య, మండల ఉపాధ్యక్షుడు తాటికొండ నర్సింలు ఆకుల భాస్కర్, వజ్రోజు బాలకృష్ణ, మైసయ్య, బత్తుల అనీల్ కుమార్, రాము నాయక్, బర్మా జంగయ్య, గదే కృష్ణ, వెంకట్ రెడ్డి, ప్రవీణ్, బొడ్డెలి శ్రీను, కనుగంటి భాను, ఇమ్లేష్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మార్నింగ్ వాక్

- సర్పంచ్ బొత్త రాములు

**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 12 :**

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా గ్రామాల్లో మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ బొత్త రాములు అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదేశానుసారం తుర్కపల్లి మండల కేంద్రంతోపాటు గంధ మల్ల, తిరుమలపురం, వాసాలమర్రి, కొండాపురం, దత్తాయ పల్లి, వెంకటాపురం, ఇబ్రహీంపురం, వేల్పు పల్లి, బుజ్జవానికుంట తండా, ముల్కల పల్లి తోపాటు అన్ని గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళ్లి ప్రజలను స్వయంగా కలుసుకొని ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందుతున్నాయా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను విని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ జింకల ఎల్లేష్ యాదవ్, ఉపసర్పంచ్ గుమ్మడి బాలరాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్దగొల్ల కిష్టయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు గజం వంశీ, ఇంద్రనగరం గ్రామ శాఖ అధ్యక్షుడు కోటి కిషన్, ఆంజనేయులు, ఆవుల కృష్ణమూర్తి, ఆవుల అశోక్, జూపల్లి తిరుపతి, ఆలేటి శ్రీశైలం, మహేందర్, వార్డు సభ్యులు, బిక్షపతి, దయానంద్, అన్ని గ్రామాల్లో అన్ని గ్రామ సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు నాయకులు పాల్గొన్నారు.



## పంద్రాగస్టున ప్రజలకు సంక్షేమ కానుకలు

- దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ వెల్లడి

**జయభేరి, దేవరకద్ర :**

ఈనెల పంద్రాగస్టున ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం సంక్షేమ కానుకలను అందజేయనుందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆరోజు 2.25 లక్షల మందికి నూతన పింఛన్ లను ప్రభుత్వం మంజూరు చేయబోతుందన్నారు. అలాగే 5 లక్షల కుటుంబాలకు గ్యాస్ సబ్సిడీ,3 నుంచి 4 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ రేషన్ కార్డు,1.05 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను సంగారెడ్డిలో జరిగే ఓ కార్యక్రమంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఈ సంక్షేమ పథకాలను ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తెలిపారు.

# విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- దేవరకద్ర, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యేలు
- భూత్పూర్ లో విద్యార్థులకు నోట్ బుక్స్ ల పంపిణీ

**జయభేరి, దేవరకద్ర :**



విద్యా రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్), రాజేష్ రెడ్డి అన్నారు.దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు నోట్ బుక్స్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర,నాగర్ కర్నూల్ ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని అన్నారు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక వసతులు, పౌష్టికాహారం అందించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ముఖ్యమంత్రి.రేవంత్ రెడ్డి విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, విద్యారంగంపై 38 సార్లు సమీక్ష సమావేశం నిర్వహించారని తెలిపారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్య మంత్రి ఏనాడు విద్యా వ్యవస్థ పై సమీక్ష నిర్వహించ లేదన్నారు.విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి నేతృత్వంలో మాజీ ఐఏఎస్ ఆకునూరు మురళి నేతృత్వంలో విద్యా కమిషన్ వేసి విద్యా కమిషన్ ద్వారా పాఠశాలలు, కళాశాలలను పరిశీలించి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా నిపుణులతో చర్చించి రూపొందించిన సూచనల ఆధారంగా సంస్కరణలను అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థులు ఆకలితో చదవాల్సిన పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని అమలు చేయడంతో పాటు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. విద్యా కమిషన్ సూచన మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోర్డులు, నోట్‌బుక్స్, విద్యా సామగ్రి, మెరుగైన తరగతి గదులు, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ, ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిందని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, అధ్యాపకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి లో పీఎం సేతు క్లస్టర్ ఐటీఐ ఏర్పాటు చేయాలి

**జయభేరి, గోదావరిఖని :**

పెద్దపల్లి నియోజకవర్గంలో పీఎం సేతు క్లస్టర్ ఐటీఐ ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి , పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలో పీఎం సేతు క్లస్టర్ ఐటీఐ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలోని విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ పొందే అవకాశం కలుగుతుంది. దీని ద్వారా యువతకు మంచి భవిష్యత్తుకు బాటలు పడటంతో పాటు నిరుద్యోగ సమస్యను గణనీయంగా తగ్గించేందుకు అవకాశం ఉంటుంది. క్లస్టర్ ఐటీఐ ద్వారా వివిధ పారిశ్రామిక రంగాలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించి, శిక్షణ పూర్తిచేసిన వారికి ఉద్యోగ అవకాశాలు మరియు ఉపాధి అవకాశాలు మరింతగా పెరిగే అవకాశం ఉంది. పెద్దపల్లి ప్రాంతంలో ఉన్న పరిశ్రమలకు కూడా నైపుణ్యం కలిగిన స్థానిక యువత అందుబాటులోకి వస్తారు. పెద్ద పెల్లి ప్రాంతానికి ఈ యొక్క పరిశ్రమములను ను తీసుకురావడానికి కృషి చేస్తున్నటువంటి తెలంగాణ రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్ద పెల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ కి పెద్దపల్లి పార్లమెంటు ప్రజల తరపున పి.మల్లికార్జున్ శ్రమ శక్తి అవార్డు గ్రహీత, అనుమాస శ్రీనివాస్ జీన్స్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు వారికీ ధన్యవాదాలు తెలుపుతున్నాము.

# ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారా మాత్రమే ఎరువుల పంపిణీ

- 17 నుండి యాప్ ద్వారా మాత్రమే ఎరువుల పంపిణీ

**జయభేరి, దేవరకద్ర :**

ఎరువుల పంపిణీలో నూతన విధానాన్ని అమలు చేయనున్నారు. ఈనెల 17 నుండి "ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ (FFS)" యాప్ ద్వారా మాత్రమే ఎరువులను పంపిణీ చేయనున్నారు. రైతులకు ఎరువులు పారదర్శకంగా, అవసరానికి అనుగుణంగా, సులభతరంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా "ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ (Framework for Fertilizer Sale FFS)"అనే నూతన డిజిటల్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ఈ విధానంలో భాగంగా 2026 ఆగస్టు 17 నుండి దేవరకద్ర మండలంలోని రైతులకు ఎరువుల పంపిణీ పూర్తిగా FFS యాప్ ద్వారానే నిర్వహించబడుతుంది. ఇప్పటి వరకు అమలులో ఉన్న విధానానికి భిన్నంగా, ఇకపై రైతులు తమ సాగు అవసరాలకు అనుగుణంగా ముందుగానే యాప్‌లో నమోదు చేసుకుని ఎరువులను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. రైతు వివరాలు, సాగు భూమి, పంట వివరాలు, అవసరమైన ఎరువుల సమాచారం ఆధారంగా ఎరువుల పంపిణీ ప్రక్రియ జరుగుతుంది. దీనివల్ల రైతులకు అవసరమైన ఎరువుల ప్రణాళిక మరింత సమర్థవంతంగా రూపొందించబడటంతో పాటు పంపిణీ ప్రక్రియలో పారదర్శకత పెరుగుతుంది. FFS యాప్‌లో రైతులు ఎలా నమోదు చేయాలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. రైతులు తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లో Google Play Store ద్వారా FFS యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని నమోదు చేసుకోవాలి. Farmer ID ఉన్న రైతులు Farmer ID లేదా ఆధార్ సంఖ్య ద్వారా లాగిన్ అయ్యి, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌కు




వచ్చే OTP ద్వారా తమ వివరాలను ధృవీకరించుకోవచ్చు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత రైతు భూమి వివరాలు స్వయంచాలకంగా యాప్‌లో అందుబాటులోకి వస్తాయి. Farmer ID లేని రైతులు ఆధార్ సంఖ్యతో eKYC పూర్తి చేసి, OTP ధృవీకరణ అనంతరం నమోదు ప్రక్రియను కొనసాగించవచ్చు. భూమి వివరాలు కనిపించకపోతే ఏమి చేయాలో కూడా అధికారులు వివరించారు. కొంతమంది రైతుల భూమి వివరాలు Farmer Registryలో అందుబాటులో లేకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో యాప్‌లో ఉన్న "Sync Lands with Farmer Registry" సదుపాయాన్ని ఉపయోగించి భూమి వివరాలను సమకాలీక రించుకోవచ్చు. అయినప్పటికీ భూమి వివరాలు అందుబాటులోకి రాకపోతే "Add / Claim Land" ద్వారా భూమి వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించబడింది. ఇందులో రైతులు తమ యాజమాన్య హోదా లేదా సాగుదారునిగా సంబంధించిన వివరాలను నమోదు చేసి భూమి వివరాలను సమర్పించవచ్చు.

**పంట వివరాలు నమోదు తప్పనిసరి...**

భూమి వివరాలు నమోదు పూర్తయిన తర్వాత రైతులు ప్రస్తుత సీజన్‌లో సాగు చేయబోయే పంటను తప్పనిసరిగా ఎంపిక చేయాలి. అనంతరం ఏ భూమికి ఎరువులు అవసరమో ఆ భూమిని ఎంపిక చేసి, ఆయా పంటలకు అవసరమైన ఎరువుల వివరాలను నమోదు చేయాలి. యాప్‌లో భూమి విస్తీర్ణం మరియు ఎంపిక చేసిన పంట ఆధారంగా General Fertilizer Recommendation (GFR) కూడా అందుబాటులో ఉంటుంది. రైతులు అవసరాన్ని బట్టి సూచించిన పరిమాణాన్ని లేదా తమ అవసరానికి అనుగుణంగా పరిమాణాన్ని ఎంపిక చేసుకోవచ్చు.

**ఎరువుల బుకింగ్ – QR కోడ్ విధానంలో కూడా చేసుకోవచ్చు...**


రైతులు తమకు అనుకూలమైన ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఎంపిక చేసిన తర్వాత దరఖాస్తు సమర్పిస్తే, యాప్‌లో QR Code, Token Number రూపొందుతుంది. ఆ QR Code ఆధారంగా రైతులు ఎరువులను పొందవచ్చు. రైతు స్వయంగా లేదా తాను అధీకరించిన వ్యక్తి ద్వారా కూడా ఎరువులు స్వీకరించే సౌకర్యం ఈ యాప్‌లో కల్పించబడింది.

**రైతులకు కలిగే ప్రయోజనాలు ఈ విధంగా ఉంటాయి...**

ఈ నూతన విధానం ద్వారా రైతుల వివరాలు, సాగు భూమి, సాగు పంట ఆధారంగా ఎరువుల అవసరాన్ని ముందుగానే అంచనా వేయడం సులభమవుతుంది. ఎరువుల పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా, క్రమబద్ధంగా సాగేందుకు అవకాశం కలుగుతుంది. రైతులు తమ దరఖాస్తు స్థితిని యాప్ ద్వారా తెలుసుకోవడంతో పాటు QR Code ద్వారా సులభంగా ఎరువులు పొందగలుగుతారు.

**రైతులకు మండల వ్యవసాయ అధికారులు పలు సూచనలు ఇస్తున్నారు...**

మండలంలోని రైతులందరూ ఎరువుల అవసరం వచ్చిన తర్వాత కాకుండా, ముందుగానే FFS యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరడమైనది. Farmer ID, ఆధార్, మొబైల్ నంబర్, భూమి వివరాలు సిద్ధంగా ఉంచుకొని నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. యాప్ వినియోగంలో ఏవైనా సందేహాలు లేదా నమోదు సంబంధిత ఇబ్బందులు ఎదురైనట్లయితే, తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి లేదా ఎరువుల విక్రయ కేంద్రాలను సంప్రదించి అవసరమైన సహాయం పొందవచ్చు. రైతులు ఈ నూతన విధానాన్ని సద్వినియోగం చేసుకొని, 2026 ఆగస్టు 17వ తేదీ నుండి అమలులోకి రానున్న FFS విధానానికి పూర్తిస్థాయిలో సహకరించాలని దేవరకద్ర మండల వ్యవసాయ శాఖ అధికారులు కోరుతున్నారు.



## యాదగిరీశుడికి నిత్యపూజల వైభవం

**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 12 :**

తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రం శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మినరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ,స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా బుధవారం రూ.11,54,133 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.47,350,బ్రేక్ దర్శనం ద్వారా రూ.88,200, శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజల ద్వారా రూ.8,000, వీఐపీ దర్శనం ద్వారా రూ.87,900, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.2,21,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.34,632, ప్రసాద విక్రయం ద్వారా రూ.4,03,350, కల్యాణకట్ట ద్వారా రూ.11,000తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

## ఈనెల 14న యాదగిరిగుట్ట ధర్మ కర్తల మండలి సమావేశం

- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన యాదగిరిగుట్ట ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు తూళ్ళ విజయేందర్ గౌడ్



**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 12 :**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి భక్తుల సేవలో అంకితభావంతో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని,యాదాద్రి క్షేత్ర వైభవాన్ని మరింత చాటుతామని యాదగిరిగుట్ట ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు తూళ్ళ విజయేందర్ గౌడ్ అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర రవాణా,పంచాయితీ రాజ్,పశుసంవర్ధక శాఖ మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క,వాకాటి శ్రీహరితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని తూళ్ళ విజయేందర్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మి నరసింహ స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని సీఎం రేవంత్ రెడ్డికి తూళ్ళ విజయేందర్‌గౌడ్ అందించారు. అనంతరం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయ అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించారు. ఈ నెల 14న జరగనున్న యాదగిరిగుట్ట ఆలయ ధర్మకర్తల మండలి సమావేశంలో చర్చించనున్న అంశాలు,భక్తుల సౌకర్యాలు, యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల విస్తరణ, సాంకేతికత వినియోగం, పరిపాలనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. యాదాద్రి క్షేత్రానికి దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు,ప్రతి భక్తుడికి ఆధ్యాత్మిక అనుభూతితో పాటు అత్యుత్తమ సౌకర్యాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటికే ఆలయంలోని పనుల పురోగతి,పెండింగ్ పనులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాల వంటిపై తన దృష్టికి వచ్చాయని,త్వరలో వాటన్నింటినీ పరిష్కరించి భక్తుల కోసం మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- సీఐ బాస్కర్



**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 12 :**

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి ప్రాణాలను కాపాడుకోవచ్చని యాదగిరిగుట్ట సీఐ భాస్కర్ సూచించారు. బుధవారం యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామంలో రోడ్డు భద్రత,ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ బాస్కర్ మాట్లాడుతూ బైక్ నడిపేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, కారులోని వ్యక్తులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ గమనిస్తూ నిబంధనలు పాటించాలి, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు సెల్‌ఫోన్లు ఉపయోగించకూడదని, ఓవర్ టేక్ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాదాచారులు తప్పనిసరిగా జీబ్రా క్రాసింగ్ ఉపయోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్సైలు యాదయ్య, ప్రసాద్, ఖాజా మొయినుద్దీన్‌తో పాటు పోలీసు సిబ్బంది,మల్లాపురం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి పథకాలపై అధికారులతో ఎమ్మెల్యే చర్చ

- వనపర్తిలో ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డ్ సమావేశం
- హాజరైన మంత్రులు ఎమ్మెల్యేలు జిల్లా కలెక్టర్లు ఇరిగేషన్ శాఖ ఉన్నత అధికారులు

**జయభేరి, దేవరకద్ర :**



వనపర్తి జిల్లా కలెక్టరేట్ లో బుధవారం ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలు జిల్లా కలెక్టర్లు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డ్ (ఐఏబి) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని (కోయిల్ సాగర్, సరళ సాగర్, శంకర్ సముద్రం) సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, రైతులకు విడుదల చేయవలసిన సాగునీటి వివరాలను అధికారులను ఎమ్మెల్యే జిఎంఆర్ అడిగి తెలుసుకున్నారు. అలాగే జూరాలకు వస్తున్న వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని ఉంద్యాల పంప్‌హౌస్, భీమా ఫేజ్-1, భీమా ఫేజ్-2 ఎత్తిపోతల పథకాల ద్వారా కోయిల్ సాగర్, శంకర సముద్రం, సరళ సాగర్‌కు నిరంతరం తరలించాలని అధికారులను ఆదేశించారు. అలాగే కోయిల్ సాగర్, శంకర సముద్రం, సరళ సాగర్ నీటి మట్టాలపై అధికారులతో సవివరంగా చర్చించి, ఆయా రిజర్వాయర్ల నీటి లభ్యతను రైతుల సాగు అవసరాలకు అనుగుణంగా వినియోగించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. మోటర్లలో సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టి ఎత్తిపోతల పథకాలు నిరంతరాయంగా పనిచేసేలా చూడాలని అధికారులను కోరారు. కోయిల్ సాగర్, శంకర్ సముద్రం కాలువల ద్వారా నీటిని విడుదల చేసి, భూగర్భ జలాలు పెరిగేలా, బోర్లు రీఛార్జ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.రైతులకు సాగునీటి కొరత లేకుండా అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరును సమర్థవంతంగా వినియోగించుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

## ఘనంగా ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం 91వ ఆవిర్భవ దినోత్సవం వేడుకలు

- భగత్ సింగ్ రాజ్ గురు సుకుదేవ్ ఆశయాలతో యువత ముందుకు సాగాలి

**జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 12 :**



ఏఐఎస్ఎఫ్ 91 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాశ్ నాయక్ ఆధ్వర్యంలో షాద్ నగర్ పట్టణంలోని వీఐఐటి జేఈఈ అకాడమీ జూనియర్ కాలేజ్ లో ఘనంగా జండా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జెండా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం. పవన్ చౌహాన్ పాల్గొని జెండాను ఎగరవేసి అనంతరం మాట్లాడుతూ... ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం అనేది 1936 ఆగస్టు 12న ఉత్తర్ ప్రదేశ్ రాజధానిలోని లక్నో నగరం బెనారస్ విశ్వవిద్యాలయంలో స్వతంత్ర ఉద్యమంలో విద్యార్థులు ఉద్యమించినప్పటికీ దేశవ్యాప్తంగా జాతీయస్థాయిలో విద్యార్థి సంఘం అవసరమని భావించి ఉత్తరప్రదేశ్ డిగ్రీ విద్యార్థులు ప్రేమ నారాయణ భార్గవ్ బాబురుద్దీన్ లు కలిసి విద్యార్థి సంఘాన్ని స్థాపించారు నాటి నుండి నేటి వరకు విద్యార్థుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తూ 90 సంవత్సరాలు పూర్తి చేసుకుని 91వ సంవత్సరంలో అడుగుపెడుతున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ నాడు స్వతంత్ర ఉద్యమంలో నేడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమం చేసిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ప్రస్తావించారు విద్యార్థులందరూ ఏఐఎస్ఎఫ్ జెండా నీడన విద్యార్థుల హక్కులకై పోరాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు అరటి పండ్లు పంపిణీ చేశారు.ఈ యొక్క కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్, హర్షిత్, సంతోష్ విద్యార్థి విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి

- మంత్రి కొండా సురేఖ

**జయభేరి, హైదరాబాద్ :**

వన్యప్రాణుల వేట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెరువుసింగారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ మృతి చెందడం పై అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అనుమానితులు జంతువులను వేటాడుతున్నారన్న సమాచరంతో వారిని పట్టుకునేందుకు మరో ముగ్గురు బీట్ ఆఫీసర్లతో కలిసి వెళ్ళిన నవీన్ బూర్గంపాడు మండలం నకిరేపేట గ్రామంలో విధి నిర్వహణలో భాగంగా ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని మంత్రి అన్నారు. ఈ ఘటన పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్ తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నవీన్ ను వెంటనే హాస్పిటల్ కు తీసుకెళ్ళినప్పటికీ అప్పటికే మృతిచెందినట్లు డిఎఫ్ఓ మంత్రికి వివరించారు. అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణలో అటవీ సిబ్బంది పోషిస్తున్న పాత్ర అసమాన్యమైనదని మంత్రి కొండా సురేఖ అన్నారు. వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలను అమర్చడం అత్యంత ప్రమాదకరమైన చర్య అని, ఇలాంటి అక్రమాలకు పాల్పడే వ్యక్తుల వల్ల వన్యప్రాణులతో పాటు అటవీ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతున్నదని మంత్రి సురేఖ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అటవీ శాఖ, పోలీసు అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులను చట్టప్రకారం కఠినంగా శిక్షించేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. మృతిచెందిన నవీన్ కుటుంబానికి మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విధి నిర్వహణలో అటవీ సిబ్బంది భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి అటవీ అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం మృతుడు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేలా త్వరితగతిన చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ పిసిసిఎఫ్ వినయ్ కుమార్ ను ఆదేశించారు.



## దేవరకద్ర మత్య సహకారం సంఘం ఏర్పాటు

- సంఘం అధ్యక్షుడిగా రాజమూరి శ్రీనివాస్

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం మత్స్య సహకార సంఘాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా దేవరకద్ర కు చెందిన రాజమూరి శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షుడిగా సి. రాజు, కార్యదర్శిగా కే. కృష్ణయ్య, డైరెక్టర్లుగా టి.బుచ్చన్న,ఊషన్న, నరేష్, వి.ఆంజనేయులు, ఎస్. వెంకటయ్య, సి. చెన్నయ్య లను ఎన్నుకున్నారు.

## సిపిఐ ప్రచార జాతకు ప్రజలంతా మద్దతు ఇవ్వాలి

- సిల్వేరు దుర్గయ్య

**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 12 :**

'హలో తుర్కపల్లి' తుర్కపల్లి మండలంలో జరిగే సిపిఐ ప్రచార జాతను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి సిల్వేరు దుర్గయ్య అన్నారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ జాతీయ పిలుపులో భాగంగా 6వ తేదీ నుండి 24వ తేదీ వరకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు ప్రచార జాతలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా తుర్కపల్లి మండలంలోని గ్రామాల్లో 14వ తేదీ ఉదయం ప్రారంభమై అన్ని గ్రామాల్లో తిరగడం జరుగుతుందని అన్నారు. ఇట్టి కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీ రాములు , జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల నిర్మాణ బాధ్యులు కృష్ణ పాల్గొంటారని తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని జాతలను జయప్రదం చేయాలని కోరారు.

## ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ను స్వాగతం పలికిన రామావత్ రమేష్ నాయక్


**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లపల్లి పట్టణానికి విచ్చేసిన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ నెంబర్ నేనావత్ రాంబాబు నాయక్ ని కొండమల్లేపల్లి చౌరస్తాలో రామావత్ రమేష్ నాయక్, ఎస్సీ ఎస్సీ సంఘాల నాయకులు సాధారణంగా స్వాగతం పలికి శాల్వాతో సత్కరించడం జరిగింది అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు నేనావత్ కృష్ణ, నేనావత్ మధు, ఆదిరాల రమేష్, మూడవత్ జగ్గూ నాయక్, శంకర్ నాయక్, సైదులు,కోర్ర కోటేష్, బాలు, బాలకృష్ణ, అందుగుల నాగరాజు, అందుగుల కేశవులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్యశారదలతో కలిసి రెండు జిల్లాల ఉన్నతాధికారులతో సమీక్ష.

**జయభేరి, పరకాల, ఆగష్టు 12:**



ఆగష్టు 16న పరకాల పట్టణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్యశారదలతో కలిసి రెండు జిల్లాల ఉన్నతాధికారులతో సీఎం పర్యటన ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లు, శాఖల వారీగా చేపడుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన వేదిక ఏర్పాటు, సభా ప్రాంగణం, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలు, ప్రజాప్రతినిధుల రాకపోకలు, బారికేడింగ్, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, భద్రతా చర్యలు, హెలిప్యాడ్, తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. సభా ప్రాంగణంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ముందుగానే ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున పార్కింగ్ ప్రాంతాలను ముందుగా గుర్తించి, ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేయాలని సూచించారు.

సభా ప్రాంగణంలో తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య సిబ్బంది, వైద్య బృందాలు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉండేలా చూడాలని, అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లను పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో నిర్వహించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. వీఐపీ రాకపోకలు, ప్రజల ప్రవేశం, అత్యవసర మార్గాలకు సంబంధించి స్పష్టమైన ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. సీఎం పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, చివరి నిమిషంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడంలో అధికార యంత్రాంగం సమష్టిగా కృషి చేయాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రవి, గణేష్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, హనుమకొండ, వరంగల్ జిల్లాల డీఆర్‌డీవోలు, జెడ్పీ సీఈవోలు, పోలీస్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్, అగ్నిమాపక, ట్రాన్స్‌పోర్ట్, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## లింక్ ప్రొడక్ట్స్ విధానాన్ని రద్దు చేయాలి

- ఎరువుల డీలర్ల డిమాండ్

**జయభేరి, పరకాల, ఆగష్టు 12:**

పరకాల మండల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ & సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గండె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహాయ వ్యవసాయ సంచాలకులు పరకాలకి ఎరువుల వ్యాపారంలో డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ, ఎరువుల డీలర్లపై వివిధ కంపెనీలు లింక్ ప్రొడక్ట్స్ పేరుతో అదనపు ఉత్పత్తులను తీసుకోవాల్సిందిగా ఒత్తిడి చేయడం వల్ల డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా యూరియా, డి ఏ పి వంటి ప్రధాన ఎరువులతో పాటు జింక్, బయో ఫర్టిలైజర్స్ తదితర ఉత్పత్తులను తప్పనిసరిగా లింక్ చేసి విక్రయించే విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరారు. డీలర్లకు అవసరం లేని ఉత్పత్తులను కంపెనీల నుంచి తీసుకోవాల్సి రావడం వల్ల పెట్టుబడి నిలిచిపోవడంతో పాటు, వాటి నిల్వలు పెరిగి ఆర్థికంగా నష్టం వాటిల్లుతోందని తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించడమే డీలర్ల ప్రధాన ఉద్దేశమని, కంపెనీల లింక్ విధానం వల్ల డీలర్లు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే, లింక్ ప్రొడక్ట్స్ విషయంలో కంపెనీల ఒత్తిడిని నియంత్రించి, డీలర్లపై ఎలాంటి బలవంతపు కొనుగోళ్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఏ డి ఏ అవినాష్ వర్మ ని కోరారు. డీలర్ల సమస్యలను వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తగిన చర్యలు తీసుకునేలా సహకరించాలని అసోసియేషన్ తరఫున విజ్ఞప్తి చేశారు.



## ఏపీలో ఉమ్మడి... తెలంగాణలో ఒంటరి

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 12 :**

తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు ప్రకటించారు. ఈ ప్రకటన తీవ్ర రాజకీయ కలకలానికి దారితీసింది. ఆంధ్రాలో కూటమిగా కలిసి పనిచేస్తున్నప్పటికీ, తెలంగాణలో పొత్తుల ఆశలతో ఉన్న జనసేన శ్రేణులకు ఈ వ్యాఖ్యలు గుండెల్లో రాయి పడ్డట్టే అయ్యాయి. దీనిపై తెలంగాణ జనసేన ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తక్షణమే స్పందిస్తూ.. పొత్తుల అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది రామచందర్ రావు కాదని, ఢిల్లీలోని బీజేపీ హైకమాండ్ , జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఒకవేళ బీజేపీ రాబోయే రోజుల్లో ఒంటరిగానే వెళ్లాలని భావిస్తే, జనసేన కూడా తెలంగాణలో సొంతంగానే బరిలోకి దిగుతుందని ఆయన కుండబద్దలు కొట్టారు.గత అసెంబ్లీ ఎన్నికల అనుభవాలను పరిశీలిస్తే.. తెలంగాణలో బీజేపీజనసేన కలిసి పొత్తుతో పోటీ చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదు. పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన 8 స్థానాల్లో ఒక్కచోట కూడా బోణీ కొట్టలేకపోయింది. తాండూరు నుంచి పోటీ చేసిన శంకర్ గౌడ్‌తో సహా పోటీ చేసిన అభ్యర్థులందరూ డిపాజిట్లు కోల్పోయిన పరిస్థితి నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ద్వారా సాధించిన రికార్డు స్థాయి విజయం, పవన్ కళ్యాణ్‌కు పెరిగిన ఇమేజ్‌ను ఆసరాగా చేసుకుని తెలంగాణలో బలపడాలని చూస్తున్న జనసేన ఆశలపై.. బీజేపీ రాష్ట్ర నేతల ఒంటరి పోరు వ్యాఖ్యలు పెద్ద దెబ్బగానే భావించవచ్చు. జనసేనను దూరం పెట్టి తెలంగాణలో ఒంటరిగా పోటీ చేయాలనే వ్యూహం బీజేపీకి ఏమేరకు మేలు చేస్తుందనేది పెద్ద ప్రశ్నార్థకమే. తెలంగాణలో బీఆర్ఎస్‌ను వెనక్కి నెట్టి, అధికార కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయంగా ఎదగాలని కమలనాథులు భావిస్తున్నారు. ఈ క్రమంలో పొత్తులు పెట్టుకుంటే పార్టీ స్వయం సమృద్ధి దెబ్బతింటుందని, ఇతర పార్టీల ఇమేజ్‌పై ఆధారపడే పరిస్థితి వస్తుందని బీజేపీ భావిస్తోంది. కానీ, గ్రేటర్ హైదరాబాద్ , ఆంధ్రా సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, నల్గొండ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఉన్న అశేష అభిమాన గణాన్ని, ఆంధ్రా సెటిలర్ల ఓటు బ్యాంకును పూర్తిగా విస్మరించడం బీజేపీకి అంత సులభం కాదు. కాంగ్రెస్ బలమైన పోటీ ఇస్తున్న ప్రస్తుత తరుణంలో ఓట్ల చీలిక బీజేపీకే నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది.రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే సూత్రం ఇక్కడ కూడా వర్తిస్తుంది. ఇప్పుడు స్థానిక నేతలు ఎంతగా ఒంటరి పోరు అని చెబుతున్నా.. అసలు ఎన్నికల సమయం దగ్గరపడేసరికి కేంద్ర బీజేపీ పెద్దలు పవన్ కళ్యాణ్‌తో మాట్లాడి పొత్తులపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలను కొట్టిపారేయలేం. ఒకవేళ పొత్తు కుదరకపోతే తెలంగాణలో జనసేన ఉనికి కాపాడుకోవడానికి ఒంటరిగా పోటీ చేయక తప్పదు. ఏది ఏమైనా, అధిష్ఠానాలు ఇంకా పెదవి విప్పకముందే లోకల్ లీడర్లు చేస్తున్న ఇలాంటి ప్రకటనలు గ్రేటర్ , తెలంగాణవ్యాప్తంగా ఉన్న జనసేన శ్రేణులను గందరగోళంలో పడేశాయి.

## పరకాలలో ఘనంగా తిరంగా ర్యాలి

- జాతీయ జెండాలతో కదం తొక్కిన విద్యార్థులు
- దేశభక్తి నినాదాలతో మార్మోగిన పరకాల

**జయభేరి, పరకాల, ఆగష్టు 12:**




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు భారతీయ జనతా పార్టీ పరకాల పట్టణ, మండల శాఖల ఆధ్వర్యంలో, పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్, మండల శాఖ అధ్యక్షులు కాసాగాని రాజకుమార్ నాయకత్వంలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. పరకాల ప్రభుత్వ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీ బస్టాండ్ సర్కిల్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా కదం తొక్కారు. జాతీయ జెండాల రెపరెపలు, విద్యార్థుల దేశభక్తి నినాదాలతో పరకాల పట్టణం మార్మోగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల కాంటెస్ట్ ఎమ్మెల్యే డా. పగడాల కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర నాయకులు గుజ్జ సత్యనారాయణ రావు హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ జెండా ప్రతి భారతీయుడి గర్వానికి ప్రతీక అని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వం, దేశభక్తి భావాలను మరింత బలోపేతం చేయడమే తిరంగా ర్యాలీ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అలాగే ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని, జాతీయ సమైక్యతను, ఐక్యతా భావాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ర్యాలీలో విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొనడం పట్ల బీజేపీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు మరియు ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

తిరంగా ర్యాలీ ద్వారా పరకాలలో దేశభక్తి స్ఫూర్తి మరింత ఉవ్వెత్తున ఎగిసిందని, యువతలో జాతీయ భావాలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని గాజుల నిరంజన్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్పి జయంతి లాల్, దేవునూర్ మేఘనాథ్, జిల్లా కోశాధికారి రామన్న, పరకాల కౌన్సిలర్లు కుక్కల విజయకుమార్, బెజ్జంకి పూర్ణచారి, ఆకుల లావణ్య శ్రీధర్, నాయకులు చందుపట్ల రాజేందర్రెడ్డి పట్టణ ఉపాధ్యక్షులు మిడిదొడ్డి నరేష్, పట్టణ మండల ప్రధాన కార్యదర్శులు సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, పి.మల్లారెడ్డి, దంచనాదుల కిరణ్, సోషల్, పరకాల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, స్పెషల్ మీడియా కన్వీనర్ మెంతుల సురేష్, నాయకులు మార్త బిక్షపతి, మారేడుగొండ భాస్కరాచారి, దుబాసి కృష్ణ ప్రసాద్, కానుగుల గోపీనాథ్, బాసాని సోమరాజు, ముత్యాల దేవేందర్, కోడెల లింగమూర్తి, దాసరి వెంకటేశ్వర్లు, సారంగ నరేష్, కొలనుపాక రేవంత్ సిద్ధు, రంతు, లింగయ్య,నగేష్, నవీన్, రమేష్, వీరాస్వామి, కొమురయ్య, దేవేందర్ గార్లు బూత్ అధ్యక్షులు సురేష్, లింగయ్య, అరుణ్, ఓదెలు, సదయ్య, శశిధర్ రెడ్డి, మురళి, బిక్షపతి, శివ, వెంకటేశ్వర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నివాళులర్పించిన సోదా రామకృష్ణ



**పరకాల, ఆగష్టు 12:**

పరకాల పట్టణానికి చెందిన విజయ్ శ్రీ ఫైనాన్స్ యజమాని మొలుగూరి మురళీ మోహన్ నిన్నటి దినమున గుండెపోటుతో అకాల మరణం చెందగా బుధవారం వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ, పరకాల మాజీ శాసనసభ్యులు మొలుగూరి బిక్షపతి సమన్వయ కమిటీ సభ్యులు పసుల రమేష్, బండి సదానందం గౌడ్, మార్క రఘుపతి గౌడ్, ఏకు రాజు, బొచ్చు జెమిని తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ ఆర్. ఎస్. రంగనాథన్ జయంతి



**జయభేరి, దేవరకొండ :**

మునగల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), దేవరకొండలో లైబ్రరీ విభాగం ఆధ్వర్యంలో గ్రంథాలయ శాస్త్ర పితామహులు డాక్టర్ ఆర్.ఎస్. రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గంధపాలకుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామవత్ రవి మాట్లాడుతూ కళాశాల గ్రంథాలయంలో 14 వేలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని అలాగే గ్రూప్స్,సివిల్స్, విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు కూడా అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.కోటయ్య, అకాడమీ కోఆర్డినేటర్ సి. లింగమయ్య , గ్రంథాలయ విభాగం ఇన్చార్జ్ డా..కె. రేణుక, మెంబెర్స్ కె.నాగరాజు, వి. యాదయ్య, ఎస్. నర్మదా దేవి, వి . వెంకటేష్, పి. కొండల్ తదితర అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కష్టజీవి నిర్మాణ కార్మికులకు వృద్ధాప్య భరోసా కల్పించాలి

**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 12 :**



కష్టజీవి నిర్మాణ కార్మికులకు వృద్ధాప్య భరోసా కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం పలువుల మైసమ్మ తల్లి పెయింటర్స్ యూనియన్ సమావేశాన్ని పెద్దమ్మ గుడి వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అందాల్సిన సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావడం లేదని పెండింగ్లో ఉన్న క్లైమ్లను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రమాద బీమా, పెన్షన్, ప్రస్తుతి సహాయం, పిల్లల విద్యా సహాయం వంటి పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ ప్రక్రియను సులభతరం చేయాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని పనిలో ప్రమాదాలు జరిగినప్పుడు బాధ్యత కుటుంబాలకు తగిన నష్టపరిహారం అందజేయాలని అన్నారు. ప్రభుత్వం కార్మిక సమస్యలు నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పోతరాజు జహంగీర్, మండల కన్వీనర్ వెంకటేశం, గీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొక్కొండ లింగయ్య, పెయింటర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు ఉచ్చెత్తల హుస్సేన్, ఉపాధ్యక్షులు మురళి, మాజీ కార్యదర్శి మేడిపల్లి రాజు, కోశాధికారి సంతోష్ గౌడ్, మాజీ అధ్యక్షుడు ఆకుల రాజు, పిడుగు శ్రీశైలం, పిడుగు శ్రీను, బొల్ల శ్రీశైలం, నక్కల కొండయ్య, రమేష్, వెంకటేశ్ పాల్గొన్నారు.

## కూరగాయల సాగుపై ఆర్‌పీఎల్ శిక్షణ



**జయభేరి, మేడ్చల్:**

రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంబించి కూరగాయల సాగులో అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో రాయలాపూర్ రైతు వేదికలో ఆర్‌పీఎల్ (Recognition of Prior Learning) శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు నాణ్యమైన విత్తనాల ఎంపిక, నర్సరీ నిర్వహణ, సమగ్ర సస్యరక్షణ (ఐపీఎం), ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆధునిక సాగు పద్ధతులను పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడులతో పాటు మెరుగైన ఆదాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమానికి ఎంఏఓ ఎస్. మాధవరెడ్డి, హెచ్‌ఈఓ సాగరిక, ఏఈఓ నీరజ హాజరై కూరగాయల సాగులో పాటించాల్సిన సాంకేతిక అంశాలపై రైతులకు పలు సూచనలు చేశారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, సమతుల్య ఎరువుల వినియోగం, నీటి పొదుపు పద్ధతులు, పంటలను ఆశించే తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. శిక్షణలో అందించిన సూచనలను రైతులు ఆచరణలో పెట్టి ఆధునిక పద్ధతుల్లో కూరగాయల సాగు చేపట్టాలని అధికారులు సూచించారు. తద్వారా అధిక దిగుబడులు సాధించడంతో పాటు వ్యవసాయం ద్వారా మెరుగైన ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## డిజిటల్ మోసాలపై అవగాహనే మన రక్షణ

- ఎంఎస్ఎన్ ఉద్యోగులకు పోలీస్ అవేర్నెస్ సెషన్
- 1930 కు వెంటనే కాల్ చేయండి.. సీఐ సీతారాం

**జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 12 :**




డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు షాద్‌నగర్ పోలీసులు మరో అడుగు ముందుకేశారు. షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నా చిల్కమర్రి గ్రామంలోని ఎంఎస్ఎన్ సంస్థ ప్రాంగణంలో పనిచేస్తున్న ఉద్యోగులు,వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం "సైబర్ నేరాల అవగాహన కార్యక్రమం" 2వ వారపు సెషన్‌ను ఘనంగా నిర్వహించారు. "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిజిటల్ భద్రత..ఆర్థిక మోసాల నివారణపై పోలీస్ అధికారులు, సైబర్ నిపుణులు వివరంగా అవగాహన కల్పించారు.

**ఆన్లైన్ నేరాలకు చెక్..మన చేతిలోనే ఉంది.!**

**ఆర్థిక మోసాల గుర్తుంచండి..!**

నకిలీ స్టాక్ మార్కెట్, ట్రేడింగ్ యాప్‌లు, అధిక లాభాల ఆశ చూపే స్కీమ్‌లు, అనుమతి లేని డిజిటల్ లోన్ యాప్‌లు, వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు చోరీ చేసే ఫిషింగ్ లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**డిజిటల్ భద్రతా నియమాలు:**

బ్యాంకింగ్, సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు వాడాలని, తప్పనిసరిగా టూఫ్యాక్టర్ అథెంటికేషన్ ఎనేబుల్ చేసుకోవాలని తెలిపారు. పబ్లిక్ వైఫైలో బ్యాంకింగ్ లావాదేవీలు చేయవద్దని, అనుమానాస్పద మెసేజ్ లు, వాట్సాప్ లింక్‌లను క్లిక్ చేయవద్దని హెచ్చరించారు.

**గోల్డెన్ అవర్ ప్రాముఖ్యత..**

ఎవరైనా సైబర్ మోసానికి గురైతే మొదటి ఒక గంటలో స్పందించడం చాలా కీలకమని అధికారులు పేర్కొన్నారు. వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కు కాల్ చేయాలని, అలాగే సైబరక్రైమ్ పోర్టల్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయడం ద్వారా పోగొట్టుకున్న డబ్బును ఫ్రీజ్ చేయవచ్చని వివరించారు.

**సైబర్ నేరగాళ్ల పట్ల.. జాగ్రత్త..!!**

అనంతరం జరిగిన క్యూఏ సెషన్‌లో ఉద్యోగులు యూపీఐ సెక్యూరిటీ, వర్క్ ఫ్రమ్ హోమ్ పేరిట వచ్చే నకిలీ జాబ్ ఆఫర్లు, ఐడెంటిటీ థెఫ్ట్ గురించి అడిగిన సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. డిజిటల్ అవగాహన పెంచుకుని సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని షాద్‌నగర్ పోలీసులు పేర్కొన్నారు.





## జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- కాంగ్రెస్ కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలి: డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

**జయభేరి, మేడ్చల్:**

రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పుదూర్-కిష్టాపూర్ 298 డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ అనుబంధ కమిటీల నియామకాలపై ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం, పిసరి మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాది ఏర్పడేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ అనుబంధ కమిటీల్లో చురుకైన కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించి ప్రజలకు మరింత చేరువ కావాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజల్లో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తల సమష్టికృషితో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని సాధించడం ఖాయమని వజ్రేష్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు మహేష్ కుమార్, నాయకులు గువ్వరవి, కొండల్ రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, పోచయ్య, బల్ రెడ్డి, శేఖర్ గౌడ్, రేగురాజు, 297 డివిజన్ అధ్యక్షుడు నడికొప్పు నాగరాజు (చాపరాజు), శ్రవణ్ గుప్త, కొండల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, బిపిట్ రాజు, రంజిత్ ముదిరాజ్, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## రంగనాథన్ సేవలు చిరస్మరణీయం




**జయభేరి, మేడ్చల్:**

భారతదేశ గ్రంథాలయ ఉద్యమ పితామహుడు, ప్రముఖ గ్రంథాలయ శాస్త్రవేత్త డా. ఎస్.ఆర్. రంగనాథన్ 134వ జయంతిని పురస్కరించుకొని జాతీయ గ్రంథపాలకుల దినోత్సవ వేడుకలను జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు సమాజంలో విజ్ఞాన కేంద్రాలుగా కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు, సాధారణ ప్రజలకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నూతన గ్రంథాలయాల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పన, పాఠకులకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ నిరంతరం కృషి చేస్తుందని చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అనంతరం మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహులు యాదవ్ మాట్లాడుతూ ప్రతి గ్రామం, పట్టణంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన గ్రంథాలయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో పఠనాసక్తిని పెంపొందించేందుకు గ్రంథాలయాలు మరింత చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. డా. రంగనాథన్ ప్రతిపాదించిన "ప్రతి పాఠకునికి అతని పుస్తకం-ప్రతి పుస్తకానికి దాని పాఠకుడు" అనే భావనను స్ఫూర్తిగా తీసుకొని, నేటి డిజిటల్ యుగానికి అనుగుణంగా గ్రంథాలయాల్లో డిజిటల్ లైబ్రరీలు, కంప్యూటర్ సౌకర్యాలు, పోటీ పరీక్షల పుస్తకాలు, ఈ-లెర్నింగ్ తదితర ఆధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నర్సింహులు యాదవ్, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## అమ్మవారి హుండీలో 17 తులాల జర్మన్ సిల్వర్



**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 12 :**

లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు పూర్తయింది. బోనాల సందడి ముగిసిన తర్వాత చేపట్టిన లెక్కింపులో నగదుతో పాటు బంగారం, వెండి కానుకలు బయటపడ్డాయి. అయితే ఈసారి హుండీలో లభించిన 170 గ్రాముల జర్మన్ సిల్వర్ ప్రత్యేకంగా ఆకర్షించింది. ఆలయానికి 12 రోజుల వ్యవధిలో వివిధ రూపాల్లో మొత్తం రూ.9,90,726 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో హుండీల ద్వారా రూ.6,26,226 నగదు సమకూరింది. మిగిలిన ఆదాయం ఇతర కానుకలు, పూజా టికెట్లు, కొబ్బరికాయలు, శాంతి కళ్యాణం తదితరాల ద్వారా వచ్చినట్లు అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపు సందర్భంగా నగదుతో పాటు 0.06 గ్రాముల బంగారం, 0.28 గ్రాముల వెండి, 170 గ్రాముల జర్మన్ సిల్వర్ లభించినట్లు అధికారులు వెల్లడించారు. సాధారణంగా భక్తులు నగదు, బంగారం, వెండి రూపంలో మొక్కులు చెల్లిస్తుంటారు. ఈసారి జర్మన్ సిల్వర్ కూడా హుండీలో లభించడం ఆసక్తికరంగా మారింది. అయితే ఈ జర్మన్ సిల్వర్ సాధారణ వెండి ధరతో పోలిస్తే చాలా తక్కువగా ఉంటుంది. తులం రూ.300 నుంచి రూ.400 మధ్య ఉంటుంది. అంటే 17 తులాలు 300 చొప్పున అనుకుంటే రూ.5100 మాత్రమే. హుండీల లెక్కింపు సమయంలో మరో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. సీజ్ చేసిన నాలుగు హుండీలను అధికారులు తెరిచి కానుకలను లెక్కించారు. అయితే మరో హుండీ లాక్ ఎంత ప్రయత్నించినా తెరుచుకోలేదు. దీంతో చివరకు వెల్డింగ్ మిషన్ సహాయంతో లాక్‌ను కట్ చేసి హుండీని తెరిచి లెక్కింపు పూర్తి చేశారు. లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. తాజాగా హుండీల లెక్కింపు పూర్తి కావడంతో 12 రోజుల ఆలయ ఆదాయ వివరాలను అధికారులు వెల్లడించారు.

# విద్యార్థుల అభివృద్ధికి పూర్తి సహకారం

- చైర్‌పర్సన్ శిరీష రెడ్డి
- విద్యార్థులకు యూనిఫామ్స్, షూస్ పంపిణీ

**జయభేరి, మేడ్చల్ :**



విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, సౌకర్యాల కల్పనకు మున్సిపాలిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్, షూస్ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ శిరీష కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, పాఠశాల విద్యకు మరింత ప్రోత్సాహం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి మౌలిక సదుపాయాలు, అవసరమైన సౌకర్యాలు కల్పించడమే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని అన్నారు. విద్యార్థులకు యూనిఫామ్స్, షూస్ వంటి అవసరమైన సామగ్రి అందించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై చదువుపై మరింత శ్రద్ధ చూపేందుకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు మున్సిపాలిటీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. పాఠశాలల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు తదితర అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని శిరీష రెడ్డి సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, విద్యా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులోనూ విద్యారంగానికి అవసరమైన సహకారాన్ని అందించేందుకు మున్సిపాలిటీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) శ్రీమతి రేణుక, పీడీ సాంబశివరావు, శామీర్‌పేట ఎంఈవో కమలాకర్, అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి, ఏఏపీసీ చైర్మన్ శ్రీమతి స్వరూప, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్, నాయకులు కంఠం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మరోసారి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా రంగుల శంకర్**

భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా రెండవ సారి నియమించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని రాష్ట్ర బిజెపి ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి రంగుల శంకర్ అన్నారు ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్ తో పాటు రంగుల శంకర్ నియామకానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఓబీసీ వర్గాల సంక్షేమం కోసం, పార్టీ బలోపేతం కోసం నిబద్ధతతో, అంకితభావంతో పనిచేస్తానని సగర్వంగా తెలియజేస్తున్నానని స్పష్టం చేశారు.

## నియోజకవర్గం అధ్యక్షులుగా కామేపల్లి సైదులు

**జయభేరి, దేవరకొండ**




బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయావతి నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ ఆకాష్ ఆనంద్ నాయకత్వాన్ని స్వాగతిస్తూ తెలంగాణ రాష్ట్ర బీఎస్పీ అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ అన్న సారథ్యంలో దేవరకొండ నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తాను చీఫ్ జోనల్ ఇంచార్జ్ ఈశ్వర్ రవీందర్ నాయక్ కి, నల్లగొండ పార్లమెంటరీ ఇంచార్జ్ నల్ల ప్రసాద్ కి మరియు నల్లగొండ జిల్లా అధ్యక్షులు రవి శంకర్ కి నా హృదయపూర్వక ధన్యవాదాలు నాపై నమ్మకం ఉంచి బహుజన సమాజ్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా నన్ను నియమించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, దేవరకొండ నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ, నీలి జెండాను దేవరకొండ గడ్డపై ఎగరేసే విధంగా కష్టపడి పనిచేస్తానని హామీ ఇస్తున్నాను దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో పార్టీని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తాను. ముఖ్యంగా నియోజకవర్గం ఉన్న, విద్యార్థులు మరియు యువతతో అనుసంధానం పెంచుతూ, బహుజన సమాజ్ పార్టీ సిద్ధాంతాలు, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం గురించి విస్తృతంగా అవగాహన కల్పించేందుకు కృషి చేస్తాను బహుజనుల హక్కుల కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, బాబాసాహెబ్ డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పనిచేస్తాను నాపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను ఒక పదవిగా కాకుండా, ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావించి నిజాయితీ, నిబద్ధతతో ముందుకు సాగుతాను. అని అన్నారు.

# యూటర్న్ మూసివేత

**జయభేరి, మేడ్చల్, ఆగస్టు 12:**




మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్ రాజరాజేశ్వరి దేవాలయం సమీపంలో ఉన్న యూటర్న్‌ను బుధవారం నుంచి పూర్తిగా మూసివేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడంతోపాటు వాహనదారులు, స్థానిక ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. యూటర్న్ మూసివేత నేపథ్యంలో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. దేవరాంజాల్ వైపు నుంచి మేడ్చల్ వైపు వెళ్లే వాహనదారులు కొంపల్లి రోడ్డు ఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న వెహికల్ అండర్‌పాస్ ద్వారా వెళ్లాలని కోరారు. అదే విధంగా కొంపల్లి నుంచి దేవరాంజాల్ వైపు వెళ్లే చిన్న వాహనాలు వి. కన్వెన్షన్ వైపు నుంచి వెహికల్ అండర్‌పాస్‌ను వినియోగించుకోవాలని, భారీ వాహనాలు ప్రెస్టీజ్ పార్క్ వద్ద ఉన్న వెహికల్ అండర్‌పాస్ ద్వారా వెళ్లాలని సూచించారు.

**రాంగ్‌రూట్‌లో వెళితే చర్యలు**

మళ్లింపు మార్గాలు, అండర్‌పాస్‌ల సమీపంలో వాహనాల వేగాన్ని తగ్గించి అప్రమత్తంగా ప్రయాణించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. వాహనదారుల సౌకర్యార్థం ఆయా ప్రాంతాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూసివేసిన యూటర్న్ వద్ద రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం చట్టరీత్యా నేరమని పోలీసులు హెచ్చరించారు. రాంగ్‌రూట్‌లో వచ్చే వాహనాల కారణంగా తీవ్ర ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వాహనదారులు మార్పులను గమనించి ట్రాఫిక్ పోలీసులకు సహకరిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

**హైదరాబాద్ :**





ఎల్బీ నగర్ ఏసీపీ కార్యాలయంలో ఒక కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున 2.30 గంటలకు ఘటన చోటు చేసుకుంది.

మృతుడు ఎల్బీనగర్ పీఎస్కు చెందిన PC J. సాయికుమార్ (13128). ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయంలోని రెస్ట్రూమ్లో ఉరివేసుకున్నట్లు గుర్తించారు. సాయికుమార్ 2024 బ్యాచ్లో ఎంపికయ్యాడు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈకాప్స్ డ్యూటీ కోసం ఏసీపీ కార్యాలయానికి అటాచ్మెంట్ లో వున్నాడు.

కర్మన్ఘాట్లో స్నేహితులతో కలిసి ఓ గదిలో నివాసం వున్నాడు. ఘటన సమాచారం అందుకున్న వెంటనే కామినేని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ ముందు మృతుని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.




## గ్రేటర్ పరిధిలోనే 30 నుంచి 40 లక్షల ఓట్లు గల్లంతు

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 12 :**

తెలంగాణ ఓటర్ల జాబితాలో కోటి ఓట్లు గల్లంతయ్యే అవకాశం కనిపిస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన ముగియడంతో, లక్షలాది మంది ఓటర్ల వివరాలు లభ్యం కాకపోవడం లేదా అన్‌కలెక్టబుల్, నో మ్యాపింగ్ కేటగిరీల్లోకి చేరడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా డబుల్ ఓట్లు, నివాసాలు మారిన వారు, మరణించిన వారితో పాటు సమాచారం అందించని వారి పేర్లను ఏరివేసే క్రమంలో ఏకంగా కోటి వరకు ఓట్లకు ముప్పు వాటిల్లే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధితో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి వంటి పట్టణ జిల్లాల్లో ఈ ప్రభావం అత్యధికంగా కనిపిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే దాదాపు 30 నుంచి 40 లక్షల ఓట్లు గల్లంతయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తుండగా, మిగిలిన గ్రామీణ, పట్టణ జిల్లాల్లో సైతం లక్షలాది మంది ఓటర్ల ఆచూకీ లభించలేదని అధికారులు నమోదు చేశారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇళ్లు మారడం, ఒకే కుటుంబ సభ్యులకు వేర్వేరు నియోజకవర్గాల్లో ఓట్లు ఉండటం, సరైన డోర్ నంబర్లు లేకపోవడం మరియు బీఎల్‌ఓ ల సర్వే సమయంలో అందుబాటులో లేకపోవడమే ఈ భారీ వ్యత్యాసానికి ప్రధాన కారణాలుగా తేలుతున్నాయి. మొత్తంగా 75 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలు వెనక్కి రాలేదు. మరో 60 లక్షలకుపైగా ఓటర్ల వివరాల్లో తేడాలున్నాయి. వీరిలో ఇరవై లక్షల వరకూ తేలిపోయే ప్రమాదం ఉంది. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సేకరించిన సమాచారంలో లోపాలు ఉన్న వారిని ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తాత్కాలికంగా మినహాయించే దిశగా చర్యలు సాగుతున్నాయి. అయితే, నిజమైన ఓటర్లు కూడా ఈ రీవెరిఫికేషన్ ప్రక్రియలో భాగం కాకపోవడం వల్ల తమ ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. పోలింగ్ కేంద్రాల మార్పు, చిరునామా సరిగ్గా మ్యాచ్ కాకపోవడంతో శాశ్వతంగా నివాసం ఉంటున్న సామాన్యుల ఓట్లు కూడా అనర్హుల జాబితాలోకి చేరడం పట్ల యంత్రాంగంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ప్రచురిస్తున్న ముసాయిదా జాబితాల ఆధారంగా ఓటర్లు తమ పేర్లు ఉన్నాయో లేదో తక్షణమే తనిఖీ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఓటు గల్లంతైనట్లయితే ఎన్నికల సంఘం కేటాయించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల వ్యవధిలో ఆన్‌లైన్ పోర్టల్, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ లేదా నేరుగా బీఎల్‌ఓల ద్వారా ఫారమ్ 6, ఫారమ్ 8 దాఖలు చేసి రీఇన్‌స్టేట్ చేసుకోవచ్చని వెల్లడించారు. రాజకీయ పార్టీలు కూడా క్షేత్రస్థాయిలో ఏజెంట్లను రంగంలోకి దింపి అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడేలా చర్యలు వేగవంతం చేయాల్సిన అవసరం కనిపిస్తోంది.



# పండ్లను కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

**పండ్లు మన ఆరోగ్యానికి ఎంత మంచివో మనందరికీ తెలుసు. డాక్టర్లు సైతం ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని చెబుతారు. కానీ చాలా మంది పండ్లను కోసి కొన్ని గంటల తర్వాత తింటారు. అయితే కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. లేకపోతే అది మన శరీరం పై చెడు ప్రభావాన్ని చూపుతుంది.**

పండ్లు మన శరీరానికి మంచివని అందరికీ తెలుసు. ప్రతిరోజ పండ్లను తినడం ఆరోగ్యానికి మంచిది. విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ వంటివి పండ్లలో సమృద్ధిగా ఉంటాయి. పండ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని వైద్యులు సూచిస్తారు. కొన్నిసార్లు మనం పండ్లను కోసి అలాగే ఉంచుతాం. ఆఫీసులు, ఏదైన ప్రయాణ సమయాల్లో కోసి తీసుకెళ్తుంటారు. కొంతమంది కోసి ఫ్రిజ్‌లో పెడతారు. కొన్ని గంటల తర్వాత వాటిని తింటారు. కానీ కోసిన పండ్లను ఎంతసేపట్లో తినాలి..? అవి ఎంతకాలం మంచిగా ఉంటాయి అనేది చాలా మందికి తెలియదు. ఇవి తెలుసుకోవడం చాలా ముఖ్యం.

### పండ్లు తినడానికి సరైన సమయం ఏమిటి?

పండ్లను ఏ సమయంలో తిన్న మంచిదేనని నిపుణులు అంటున్నారు. అయితే కొన్నింటిని ఉదయం ఖాళీ కడుపుతో, మరికొన్నింటిని రాత్రి వేళలో తినకూడదని చెబుతారు. ఏదైనా సరే మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని అంటున్నారు.

### కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

కోసిన వెంటనే పండ్లు చెడిపోవు. కానీ వాటిని ఎంత త్వరగా తింటే అంత మంచిది. నిజానికి కోసిన పండ్లలో ఇన్ఫెక్షన్ ప్రమాదం పెరుగుతుంది. వేసవి, వర్షాకాలం సూక్ష్మజీవుల పెరుగుదలకు ఉత్తమ సమయాలు. కోసిన పండ్ల వల్ల ఇన్ఫెక్షన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఎక్కువసేపు నిల్వ చేయకుండా వీలైనంత త్వరగా వాటిని తినాలి. పండ్ల నుండి అన్ని పోషకాలను పొందడానికి వాటిని కోసిన అరగంటలోపు తినడం ఎల్లప్పుడూ మంచిదని అంటున్నారు.



# పొద్దునే ప్రొటీన్ ఫుడ్

పొద్దున నిద్ర లేచిన వేళా విశేషమే రోజంతటినీ నిర్ణయిస్తుంది. పొద్దునే మన టిఫిన్లలో ఇడ్లీ, పోహా, ఉప్మా, ఆలూ పరాటా లాంటివి ప్రధానంగా ఉంటాయి. ఇవన్నీ కార్బొహైడ్రేట్లతో నిండి ఉంటాయి. కానీ ఆరోగ్యానికి అత్యవసర పోషకమైన ప్రొటీన్ ఉండదు. అయితే, ఉపాహారం నుంచే 20 గ్రాముల ప్రొటీన్ అందేలా చూసుకుంటే మంచిది. అలాగని ప్రొటీన్ పౌడర్ల మీద ఆధారపడకూడదు. ఆహారంలో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. పొద్దునే ఆరగించడానికి ప్రొటీన్లతో సమృద్ధమైన టిఫిన్లు కొన్నిటి గురించి తెలుసుకుందాం. శరీర విధులు సాఫీగా సాగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. శరీర కణజాలం, కండరాలు, ఎముకలు, చర్మం, వెంట్రుకలు, గోళ్ల నిర్మాణంలో ప్రొటీన్లు కీలకంగా నిలుస్తాయి. ఎంజైముల విడుదలలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థలో అంతర్భాగం. ప్రొటీన్లు తీసుకుంటూ తగినంత వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. ప్రొటీన్లు శరీరానికి మాత్రమే కాదు మెదడు పనితీరుకు కూడా అండగా నిలుస్తాయి.

### పల్లీలు కూరగాయలతో క్వినోవా ఉప్మా

ఓ కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. దీనికి కూరగాయలు, కరివేపాకు, ఓ టేబుల్ స్పూన్ వేయించిన పల్లీలు, పచ్చి బఠాణీలు కలపాలి.ఉడికించిన శనగలతో సలాడ్ తీసుకుంటే మొత్తం 22 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి. ఒక్క క్వినోవా ఉప్మా, కూరగాయలు, పల్లీల నుంచే 17 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### శనగపిండి టోస్ట్, టోఫు బుర్జి

రెండు బ్రెడ్ పకోడీలు (శనగపిండితో చేసినవి) తీసుకోవాలి. దీనికి 75 గ్రాముల టోఫు బుర్జీ జతచేయాలి. టమాటాలు, పసుపు, జీలకర్ర కలపాలి. దీని ద్వారా 23 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### రాజ్మా పరాటా, కప్పు పెరుగు

మామూలుగా రాజ్మా లంచ్‌కే అనుకుంటారు. కానీ ఓ కప్పు రాజ్మాను ఉడికించి ముద్దగా చేసుకోవాలి. దాన్ని పరాటా స్టఫ్‌గా వాడుకోవాలి. ఇలా చేస్తే 15 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని పుదీనా, సైంధవ లవణం కలిపిన హంగ్ కర్డ్ (నీళ్లు తీసేసిన పెరుగు)లో అద్దుకుని తినేయాలి.

### సత్తు పరాటా, ఉడికించిన గుడ్డు, బటర్ మిల్క్


సత్తు అంటే వేసవి పానీయం మాత్రమే కాదు. 100 గ్రాముల సత్తులో 20 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి, కొద్దిగా నెయ్యి వేసి సత్తు పరాటా చేసుకోవాలి. తినే వాళ్లయితే దీంతోపాటు ఓ ఉడికించిన గుడ్డు తినాలి. గ్లాసెడు బటర్ మిల్క్ తాగాలి. రెండు మోస్తరు సత్తు పరాటాల నుంచి 14 గ్రాములు, ఉడికించిన గుడ్డు నుంచి 6 గ్రాములు, బటర్‌మిల్క్ నుంచి 2 గ్రాములు.. మొత్తంగా 22 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మూంగ్‌దాల్ చిల్లా పనీర్ ఫిల్లింగ్

ఒక్కో చిల్లా (దోశ లాంటిది)లో 5 6 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. వీటిలో నింపే 50 గ్రాముల తురిమిన పనీర్ నుంచి 9 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రెండు చిల్లాలను ఓ కప్పు పెరుగుతో లాగించేయాలి. పెరుగుతో లభించే 5 గ్రాములతో కలుపుకొని మొత్తం 26 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మొలక పెసర్లు ఓట్స్ చీలా

ఇది కూడా దోశలా చేసుకునేదే. అరకప్పు ఓట్స్‌లో 5 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని ఓ కప్పు పెసర మొలకలతో కలిపితే మరో 14 గ్రాములు లభిస్తాయి. దీనికి కాస్త శనగపిండిని జోడిస్తే మరో 2 గ్రాములు మొత్తంగా 21 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.





# ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలు శుభ్రం, ఆరోగ్యం

మన శరీరంలో ఎప్పటికప్పుడు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను కిడ్నీలు మూత్రం ద్వారా బయటకు పంపిస్తాయి. దీంతో శరీరంలో వ్యర్థాలు పేరుకు పోకుండా ఉంటాయి. ఆరోగ్యంగా ఉంటాము. అయితే మనం పాటించే ఆహారపు అలవాట్లు, జీవనశైలి, దీర్ఘకాలిక వ్యాధులు, వాడే మందులు వంటి కారణాల వల్ల మన కిడ్నీల పనితీరు మందగిస్తుంది. దీంతో వ్యర్థాలను కిడ్నీలు సరిగ్గా బయటకు పంపలేకపోతాయి. దీని వల్ల దీర్ఘకాలంలో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతాయి. ఇవి అనేక వ్యాధులను కలగజేస్తాయి. అందువల్ల కిడ్నీలను మనం ఆరోగ్యంగా ఉంచుకోవాలి. కిడ్నీలు ఎప్పటికప్పుడు వ్యర్థాలను బయటకు పంపిస్తూ శుభ్రంగా ఉండాలి. అప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటాం. అయితే పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. దీని వల్ల ఇతర వ్యాధులు రాకుండా కూడా అడ్డుకోవచ్చు.

### కొబ్బరినీళ్లు, యాపిల్ సైడర్ వెనిగర్..

కొబ్బరినీళ్లను రోజూ తాగడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. దీని వల్ల శిరోజాలు, చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కిడ్నీ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. కిడ్నీలు శుభ్రంగా మారుతాయి. కొబ్బరినీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్స్ కిడ్నీలను సురక్షితంగా ఉంచుతాయి. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి యాపిల్ సైడర్ వెనిగర్ కూడా పనిచేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో ఒక టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ కలిపి తాగుతుంటే కిడ్నీలు క్లీన్ అయి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గేందుకు కూడా ఇది ఎంతగానో పనిచేస్తుంది. షుగర్, కొలెస్ట్రాల్ స్థాయిలను సైతం అదుపులో ఉంచుతుంది. ఇక కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచేందుకు గాను పలు పండ్లు కూడా సహాయం చేస్తాయి. స్ట్రాబెర్రీలు, చెర్రీలు, యాపిల్స్, క్రాన్ బెర్రీలు, ద్రాక్ష, పైనాపిల్ వంటి పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది.

### ఈ ఆహారాలు కూడా అవసరమే..

అరటి పండ్లు, నారింజ పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలోని సోడియం స్థాయిలను తగ్గిస్తుంది. దీని వల్ల కిడ్నీలు శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కాలిఫ్లవర్, క్యాబేజీ, ఎరుపు రంగు క్యాప్సికం, ముల్లంగి వంటి కూరగాయలను తింటున్నా కూడా కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. కోడిగుడ్డు తెల్ల సొన, స్కిన్ లెస్ చికెన్, చేపలు, ఆలివ్ ఆయిల్, వెల్లుల్లి, ఉల్లిపాయలు వంటి ఆహారాలను కూడా తీసుకోవచ్చు. అయితే కిడ్నీలు ఎల్లప్పుడూ శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేందుకు గాను ఆహారంలో ఉప్పు తీసుకోవడం తగ్గించాలి. సోడియం తక్కువగా ఉండే ఆహారాలను తినాలి. మద్యం సేవించడం, పొగ తాగడం మానేయాలి. ఆకుకూరలు, కూరగాయలను, పండ్లను తినేందుకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. అలాగే రోజూ నీళ్లను తగిన మోతాదులో తాగాలి. ఇలా ఆహారపు అలవాట్లను పాటిస్తుంటే కిడ్నీలు శుభ్రంగా ఆరోగ్యంగా ఉంటాయి.

### బీట్ రూట్, నిమ్మరసం..

మనం బీట్‌రూట్‌ను అప్పుడప్పుడు తింటుంటాం. కానీ బీట్‌రూట్‌ను రోజువారి ఆహారంలో కచ్చితంగా భాగం చేసుకోవాలి. బీట్ రూట్‌లో పొటాషియం, నైట్రేట్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కిడ్నీలను శుభ్రం చేసి ఆరోగ్యంగా ఉంచుతాయి. రోజూ ఒక కప్పు బీట్ రూట్ ముక్కలను తింటుండాలి. లేదా ఒక కప్పు బీట్ రూట్ జ్యూస్‌ను అయినా తాగవచ్చు. దీని వల్ల కిడ్నీల ఆరోగ్యం మెరుగుపడుతుంది. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి నిమ్మరసం కూడా ఎంతగానో పనిచేస్తుంది. నిమ్మరసంలో విటమిన్ సి ఉంటుంది. కిడ్నీ స్టోన్లు ఏర్పడకుండా రక్షిస్తుంది. అదేవిధంగా అల్లం రసం కూడా ఎంతగానో మేలు చేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే అల్లం రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.



# 'రాకా'లో గిరిజన రాణిగా?

అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సైన్స్ ఫిక్షన్ మూవీ 'రాకా' ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. పురాణ, వేద, వర్తమాన కాలాల్ని అనుసంధానిస్తూ సాగే కథాంశమిదని, పునర్జన్మ, ప్రతీకారం అంశాలు ప్రధానంగా ఉంటాయని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాలో దీపికా పడుకోన్ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే కథారీత్యా మరో ఇద్దరు నాయికలకు చోటుందని చెబుతున్నారు. బాలీవుడ్ నుంచి వెలువడుతున్న వార్తల్ని బట్టి ఈ సినిమాలో జాన్వీకపూర్, రష్మిక మందన్న కీలక పాత్రల్లో కనిపించబోతున్నారని తెలిసింది. వారి పాత్రల తీరుతెన్నుల గురించి కూడా బాలీవుడ్ మీడియాలో ఆసక్తికరమైన కథనాలొస్తున్నాయి. జాన్వీకపూర్ గిరిజన రాణి పాత్రలో కనిపిస్తుందని, 'రాకా' కథా ప్రపంచంలో ఆమె పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని చెబుతున్నారు. ఇక రష్మిక మందన్న పురాణకాలం నాటి రక్షకురాలి పాత్రలో కనిపిస్తుందని సమాచారం. అయితే ఇవన్నీ కేవలం ఊహాగానాలేనా? వీటిలో ఏమైనా వాస్తవం ఉందా? అనే విషయాల్లో స్పష్టత రావాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సిందే అంటున్నారు. 'రాకా' షూటింగ్ ప్రస్తుతం ముంబయిలో జరుగుతున్నది. వచ్చే ఏడాది డిసెంబర్‌లో ఈ సినిమా విడుదలకానుంది.



# ఎన్టీఆర్ భుజానికి శస్త్రచికిత్స సక్సెస్ ..

**తాను క్షేమంగా ఉన్నానంటూ జూనియర్ పోస్ట్**

యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు గుడ్ న్యూస్. ఆయన భుజానికి నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైంది. హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో బుధవారం ఎన్టీఆర్‌కు ఆర్థోస్కోపిక్ సర్జరీ నిర్వహించినట్లు ఆసుపత్రి వర్గాలు హెల్త్ బులెటిన్ ద్వారా వెల్లడించాయి. ప్రత్యేక వైద్య నిపుణుల బృందం ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపింది. సర్జరీ అనంతరం ఎన్టీఆర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. అయితే భుజం పూర్తిగా కోలుకోవడానికి సుమారు రెండు నుంచి మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉందని వైద్యులు వెల్లడించినట్లు సమాచారం. ఈ సమయంలో తారక్ పూర్తిగా విశ్రాంతి తీసుకోవడంతో పాటు వైద్యుల సూచనల మేరకు రిహాబిలిటేషన్, ఫిజియోథెరపీ వంటి ప్రక్రియలను కొనసాగించాల్సి ఉంటుంది. ఇక సర్జరీ అనంతరం జూనియర్ ఎన్టీఆర్ స్వయంగా సోషల్ మీడియా వేదికగా తన ఆరోగ్య పరిస్థితిపై అభిమానులకు అప్‌డేట్ ఇచ్చారు. తాను క్షేమంగా ఉన్నానని, అభిమానులు చూపిస్తున్న ప్రేమ, ప్రార్థనలు తనకు ఎంతో బలాన్ని ఇస్తున్నాయని తెలిపారు. ఎన్టీఆర్ తన పోస్ట్‌లో.. "మీరందరూ చూపించిన ప్రేమ, అందించిన ప్రార్థనలకు నా మనసు నిండిపోయింది. శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. నేను క్షేమంగా ఉన్నాను" అంటూ అభిమానులకు భరోసా ఇచ్చారు. అలాగే తనకు చికిత్స అందించిన కిమ్స్ ఆసుపత్రి వైద్య బృందానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తనకు వైద్యం అందించిన అద్భుతమైన వైద్య బృందానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తన స్నేహితులు, కుటుంబ సభ్యులు, అభిమానులు అందిస్తున్న మద్దతు తనకు ఎంతో బలాన్ని ఇస్తోందని ఎన్టీఆర్ పేర్కొన్నారు. తన ఆరోగ్యం గురించి అభిమానులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఈ పోస్ట్ ద్వారా తాను బాగానే ఉన్నానని స్పష్టం చేశారు. చివర్లో "త్వరలోనే కలుద్దాం" అంటూ అభిమానులకు హామీ ఇవ్వడంతో ఆయన అభిమానుల్లో ఆనందం నెలకొంది. సర్జరీ విజయవంతంగా పూర్తైందన్న వార్తతో పాటు ఎన్టీఆర్ స్వయంగా హెల్త్ అప్‌డేట్ ఇవ్వడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ పూర్తిగా కోలుకునే వరకు వైద్యుల పర్యవేక్షణలో ఉండనున్నారు. భుజానికి సంబంధించిన గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి రెండు నుంచి మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉండటంతో, ఆయన తదుపరి సినిమా షూటింగ్ షెడ్యూల్స్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.

# ఏ ఆడకూతురులో అయినా నా కూతురిని చూసుకుంటా!




రవితేజ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'ఇరుముడి'. తండ్రీకూతుళ్ల అనుబంధం ప్రధానంగా సాగే కథ ఇది. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని తెరకెక్కించింది. ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. తండ్రీకూతుళ్ల నేపథ్యంలో ట్రైలర్ ఆసాంతం భావోద్వేగభరితంగా సాగింది. ఊరిలో జరిగిన కొన్ని సంఘటనలు ఓ తండ్రి జీవితాన్ని ఎలా ప్రభావితం చేశాయి? కూతురితో పాటు ఊరిలోని ఆడపిల్లల రక్షణ కోసం ఆ తండ్రి ఎలాంటి నిర్ణయాల్ని తీసుకున్నాడనే అంశాలతో ట్రైలర్ ఎమోషనల్‌గా సాగింది. 'నాకో బలహీనత ఉంది. ఏ ఆడకూతుర్లో అయినా నా కూతురిని చూసుకోవడం..దాని జోలికి రాకు' అనే డైలాగ్ కథ తాలూకు భావోద్వేగాల తీవ్రతకు అద్దం పట్టింది. అయ్యప్ప దీక్ష నేపథ్యం కథకు కొత్తదనాన్ని తీసుకొచ్చింది.ప్రియాభవానీశంకర్, సాయికుమార్, బేబీ నక్షత్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: శివ నిర్వాణ.



# అతడంటే పిచ్చి ఇష్టం..

ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో వరుస విజయాలతో దూసుకుపోతున్న హీరోయిన్ రితికా నాయక్. 2022లో అశోక వనంలో అర్జున కళ్యాణం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ముఖ్యంగా ఆమెకు బ్రేక్ ఇచ్చిన సినిమా మిరాయ్. ఈ సినిమా తర్వాత బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంటూ ఫుల్ బిజీగా ఉంది. ఇటీవలే వరుణ్ తేజ్ నటించిన కొరియన్ కనకరాజు చిత్రంలో నటించింది. డైరెక్టర్ మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఆగస్ట్ 7న థియేటర్లలో విడుదల కాగా.. మంచి రెస్పాన్స్ వస్తుంది. ప్రస్తుతం ఈ మూవీ సక్సెస్ ఎంజాయ్ చేస్తున్న ఈ ముద్దుగుమ్మ.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన లైఫ్, కెరీర్ గురించి వెల్లడించింది. అలాగే తనకు ఇష్టమైన హీరో ఎవరనే విషయాన్ని సైతం ప్రస్తావించింది. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రితికాను సదరు యాంకర్ ఆసక్తికరమైన ప్రశ్న అడిగారు. మీ మొబైల్ వాల్ పేపర్ ఎవరి ఫోటో ఉందని అడగ్గా.. రితికా స్పందిస్తూ..తన ఫోన్ చూపించింది. అందులో దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ మ్యూజిక్ బ్యాండ్ బీటీఎస్ గ్రూప్ ఫోటో ఉంది. బీటీఎస్ లో మీ ఫేవరెట్ ఎవరు అని అడగ్గా.. వెంటనే సుగా అంటూ చేప్పేసింది. తన ఫేవరెట్ బీటీఎస్ సభ్యుడు సుగా అని అన్నారు. అతడిని కలిసి అవకాశం వస్తే.. తాను ఏం మాట్లాడలేనని.. జస్ట్ అతడిని చూస్తూ ఉండిపోతా అని అన్నారు. సుగాకు తాను పెద్ద అభిమానిని అని.. హాయ్ ఐ యామ్ ఎ బిగ్ ఫ్యాన్ ఆఫ్ యూ అని మాత్రమే చెబుతానని అన్నారు. బీటీఎస్ వరల్డ్ టూర్ గురించి సైతం రితికా ప్రస్తావించారు. బీటీఎస్ భారత్ రాలేకపోవడం తనను చాలా బాధపెట్టిందని.. కానీ ఏదోక రోజు తప్పకుండా వస్తుందని నమ్ముతున్నట్లు తెలిపారు. మన దేశంలో బీటీఎస్ బ్యాండ్‌కు భారీగా ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందన్న సంగతి తెలిసిందే.

# ఇండియన్ బాక్సాఫీస్ వద్ద 'స్పైడర్ మ్యాన్' విధ్వంసం.. 12 రోజుల్లోనే రూ. 500 కోట్ల కలెక్షన్స్!




హాలీవుడ్ సూపర్ హీరో ఫ్రాంచైజీ 'స్పైడర్ మ్యాన్' సిరీస్ నుంచి వచ్చిన తాజా చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' (Spider Man: Brand New Day) ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త వసూళ్లతో దూసుకుపోతోంది. టామ్ హాలండ్, జెండాయా జంటగా నటించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగానే కాకుండా, మన దేశంలోనూ ఊహించని రీతిలో వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ. 12,000 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం, ఇండియన్ బాక్సాఫీస్ వద్ద కూడా అదే జోరును ప్రదర్శిస్తోంది. తాజాగా ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళ, ఇంగ్లీష్ భాషల్లో కలిపి భారతీయ మార్కెట్‌లో రూ. 500 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించింది. దీంతో మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ (MCU) సినిమాలకు భారతదేశంలో ఉన్న క్రేజ్ మరోసారి నిరూపితమైంది. వీకెండ్‌లోనే కాకుండా వీక్‌డేస్‌లో కూడా థియేటర్లు హౌస్‌ఫుల్ బోర్డులతో కళకళలాడుతున్నాయి. రెండో వారంలోనూ వసూళ్ల జోరు ఏమాత్రం తగ్గకపోగా, మొత్తం గ్రాస్ కలెక్షన్లు త్వరలోనే రూ. 520 కోట్లకు చేరుకుంటాయని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. త్వరలో కొన్ని కొత్త చిత్రాలు విడుదల కానున్నప్పటికీ, వాటిని తట్టుకుని ఈ సినిమా ఫుల్ రన్‌లో సులభంగా రూ. 600 కోట్ల గ్రాస్ మరియు రూ. 500 కోట్ల నెట్ వసూళ్లను సాధిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇప్పటివరకు భారతదేశంలో ఈ సినిమాను దాదాపు 1.7 కోట్ల మంది ప్రేక్షకులు వీక్షించారు. త్వరలోనే ఈ సంఖ్య 2 కోట్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గతంలో మన దేశంలో హాలీవుడ్ నుంచి కేవలం 'టైటానిక్', 'అవెంజర్స్: ఎండ్‌గేమ్' చిత్రాలను మాత్రమే 2 కోట్ల మందికి పైగా థియేటర్లలో చూశారు. ఇప్పుడు 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' కూడా ఆ అరుదైన రికార్డుకు చేరువలో దూసుకుపోతోంది. ఈ విజయంతో ట్రేడ్ పండితులు దీన్ని 'ఆల్ టైమ్ బ్లాక్‌బస్టర్'గా ప్రకటించారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com**, **www.jayabheridaily.com**